# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 343, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం -16 - ఏప్రిల్ - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## స్టాలిన్ కీలక నిర్ణయం... రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీ



- గవర్నర్‌తో విభేదాల నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం
- స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయనున్న కమిటీ
- పెండింగు బిల్లులపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం

2లో

## అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం



- ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా హెచ్చరిక
- ఏకపక్షంగా ఫీజులు పెంచడం, వేధించడాన్ని సహించేది లేదన్న ముఖ్యమంత్రి
- యాజమాన్యాలు నియమ, నిబంధనలు పాటించాలని సూచన
- ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇస్తామన్న ముఖ్యమంత్రి

## ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి... ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం



2

పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల ఆయుర్దాయం తగ్గుతుందన్న గడ్కరీ

ప్రజలు శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచన

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

# పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదు

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

- పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది
- మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం
- పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు"
- ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'
- సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ





హైదరాబాద్: పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం.. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు" అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేల డుమ్మా కొట్టారు. వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు. "ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం. భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచింది. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జఠిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో మిగతా..2లో

## కేసీఆర్ సూచనతోనే

# కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

- ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు
- రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది
- అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నాం
- ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశాం
- కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నా రంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే

- రేవంత్ సర్కార్‌ను కూలిస్తే బీజేపీకి ఏం లాభం?
- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎటువంటి తొందర లేదు
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే మిగతా..2లో



## ప్రధాని మోదీతో కరణం మల్లీశ్వరి భేటీ.. ఆమె కృషిని కొనియాడిన ప్రధాని

యమునానగర్‌లో ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరితో ప్రధాని భేటీ. క్రీడాకారిణిగా మల్లీశ్వరి విజయాలు దేశానికి గర్వకారణమన్న ప్రధాని యువ అథ్లెట్లకు మార్గదర్శిగా ఆమె కృషి ప్రశంసనీయమన్న మోదీ

2లో

## ప్రధాని మోడీ అమరావతి

# పర్యటన ఖరారు..

### మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి పునఃనిర్మాణంపై దృష్టిసారించింది.. ఇప్పటికే పలు రకాల పనులకు సీఆర్డీఏ అథారిటీ, ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి.. అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి మిగతా..2లో

## దేశంలోనే నెంబర్ 2గా ఆంధ్రప్రదేశ్

- నెం.2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం
- అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న ఏపీ
- సోషల్ మీడియాలో స్పందించిన సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2024-25 ఏడాదికి గాను ఆర్థిక వృద్ధి రేటు పరంగా దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి పరంగా దూసుకెళుతున్నట్టు ఈ జాతీయ నివేదిక చెబుతోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు.




"1990 ప్రాంతంలో నేను మొట్టమొదట ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. అప్పుడు బెంగళూరు నెంబర్ వన్ స్థానంలో ఉంది. కానీ ఇవాళ చూస్తే అన్ని రంగాల్లో హైదరాబాద్ నగరం నెంబర్ వన్ అయింది. అదే విధంగా, ఇవాళ మన ముందు ఒక కొత్త సవాలు లేదా కొత్త అవకాశం మన ముందు నిలిచింది. దీన్ని మనం అందిపుచ్చుకుని ముందుకెళ్లాలి. నెంబర్ 2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు


# ఏపీ కేబినెట్ ఆమోదం

### భేటీలో పలు కీలక నిర్ణయాలు



- రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం
- నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలి
- స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది
- త్వరలోనే డిఎస్సీ నోటిఫికేషన్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం . ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన మిగతా..2లో



2లో

## ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్ అణ్వాయుధాల సంగతి మరచిపోండి..

- లేదంటే మిలటరీ యాక్షన్ కు వెనుకాడబోనన్న అగ్రరాజ్యం అధ్యక్షుడు
- న్యూక్లియర్ డీల్ ను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహం
- ఇటీవల ఒమన్ వేదికగా ఇరుదేశాల మధ్య చర్చలు

## నోవోటెల్ హోటల్‌లో సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం



శంషాబాద్: శంషాబాద్ నోవోటెల్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. నోవోటెల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్టులో స్వల్ప అంతరాయం ఏర్పడింది. వాస్తవానికి ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్టులో .. ఏకంగా 13 మంది ఎక్కారు. ఓవర్ వెయిట్ కారణంగా ఆ లిఫ్ట మొరాయించింది. ఎక్కువమంది ఎక్కడంతో ఉండాల్సిన ఎత్తుకంటే కిందికి లిఫ్ట్ దిగింది. దీంతో ఒక్కసారిగా అధికారులు టెన్షన్ పడ్డారు. అటు హోటల్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎం రేవంత్ రెడ్డిని వేరే లిఫ్టులో సెకండ్ ఫ్లోర్‌కు పంపారు అధికారులు. దీంతో సీఎం రేవంత్ రెడ్డికి నోవాటెల్ లో పెను ప్రమాదం తప్పింది. దీంతో అక్కడ ఉన్న నేతలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



2లో

## హార్వర్డ్‌కు షాకిచ్చిన ట్రంప్...

# 2.2 బిలియన్ డాలర్ల నిధులు నిలిపివేత

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై వైట్ హౌస్ చర్యలు.

2.2 బిలియన్ డాలర్ల ఫెడరల్ నిధులు, 60 మిలియన్ డాలర్ల కాంట్రాక్టులు నిలిపివేత.

క్యాంపస్‌లో యూదు వ్యతిరేకత అరికట్టే డిమాండ్ల తిరస్కరణే కారణం.

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు.. పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదు

మొదటి పేజి తరువాయి



రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు. ..బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది. ..కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి. సన్న బియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే బీజేపీకి వచ్చే లాభం ఏంటని ఆయన ప్రశ్నించారు. తొందరపడి తెలంగాణలో ప్రభుత్వాన్ని కూలగొట్టమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రభుత్వానికి ఐదేళ్లు సమయం ఉంది. ప్రభుత్వాన్ని కూల గొట్టడానికి గుజరాత్ వ్యాపారులకు పని లేదా? వ్యాపారులు వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చేసుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. తాజాగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఉద్దేశ్యం మాకు లేదు. దీంతో, బీజేపీకి వచ్చే లాభమేమీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. అది అందరికీ తెలుసు. వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎటువంటి తొందర లేదు. త్వరలో కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుంది. భూములు అమ్మకం, మద్యం అమ్మకం, అప్పులు తేవడంలో తెలంగాణను నంబర్ వన్‌గా మార్చారు. అర్థరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి ఇలా చెట్లు నరికిన ఘటనలు దేశంలో తెలంగాణలో తప్ప ఎక్కడ జరగలేదు. హెచ్‌సీయూలో చెట్లు కొట్టిన ఏ1 వీడియో పోస్టుపై కేసు పెడితే పెట్టుకోండి. భావితరాలకు ల్యాండ్ కాపాడాల్సిన బాధ్యత మనపైన ఉంది. భూములు అమ్మకం ద్వారానే ప్రభుత్వం నడపాలని అనుకోవద్దు. రేవంత్ ఏ బ్రాండ్ అనేది వచ్చే ఎన్నికల్లో తేలుతుంది. నేషనలిజమే నా బ్రాండ్. ప్రాజెక్ట్ పూర్తి కాకుండా ఎస్ఎల్‌బీసీపై నేషనల్ డ్యాం సెక్యూరిటీ అథారిటీకి ఎలా ఫిర్యాదు చేస్తాం?.. సింగరేణి కార్మికులకు ఐటీ పన్నులు మేం అధికారంలోకి వస్తే రియింబర్స్ చేస్తాం. సింగరేణి కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేస్తారు. వాళ్లది వైట్ కాలర్ జాబ్ కాదు.

సన్నబియ్యంపై..

ఏ రాష్ట్రంలోనైనా ఆ రాష్ట్ర ప్రజల అవసరానికి అనుగుణంగా ఇస్తాం. కొన్ని రాష్ట్రాల్లో గోధుమలు కూడా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కోటా కాకుండా ప్రతీ లబ్ధిదారుడికి అదనంగా ఐదు కేజీల సన్న బియ్యం ఇచ్చి చూపించాలి. దొడ్డు బియ్యం పైసలతోనే సన్న బియ్యం ఇస్తున్నారు. దీంట్లో కొత్తగా ఏముంది? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలలో తమిళనాడులో నష్టపోయామని.. అక్కడ పొత్తుకు వెళ్లాం. య అధ్యక్షుడిగా నా పేరు ప్రచారంపై అటువంటి ప్రస్తావనే లేదు. దక్షిణాదికి లోక్ సభ సీట్లు తగ్గుతాయనేది గాలి ప్రచారం మాత్రమే. అన్యాయంగా వక్ఫ్ పేరుతో ఆక్రమించిన భూముల కోసమే కొంతమంది ఆందోళనలు చేస్తున్నారు. ఎంఐఎం నేతలు, అక్రమంగా లబ్ది పొందిన వారే ఆందోళనల్లో ఉన్నారు. ఏ ఒక్క సామాన్య, పేద ముస్లిం కూడా ఆందోళన చేయడం లేదు. వక్ఫ్ సవరణ చట్టం మీద భూ బకాసురులు ఉద్యమం చేస్తున్నారు. ముస్లిం ప్రార్థన మందిరాలను, వక్ఫ్‌కు సంబంధం లేదు' అని అన్నారు.

## కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. "భూభారతి' వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్

భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# బంగ్లాదేశ్ అంటే ఇష్టం ఉన్నవాళ్లు అక్కడికే వెళ్లండి..

## దీదీపై యోగీ ఫైర్



బెంగాల్: బెంగాల్ హింసాకాండపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బెంగాల్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. అమర యోధుడు రాజా నర్పతి సింగ్ విజయోత్సవం సందర్భంగా మంగళవారం హర్దోయ్ జిల్లాలోని రుయా గర్హిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం యోగి మాట్లాడుతూ.. అల్లరిమూకలను శాంతి దూతలుగా మమతా బెనర్జీ పిలుస్తారని అన్నారు. బంగ్లాదేశ్ అంటే ఇష్టం ఉన్నవాళ్లు బంగ్లాదేశ్‌కు వెళ్లాలని అన్నారు. అల్లరి మూకలకు కర్ర ఒక్కటే మందు అని.. దయ్యాలు మాటలతో ఏకీభవించవని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వారం రోజులుగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్ మొత్తం కాలిపోతోంది. కొంతమంది బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తే అక్కడికి వెళ్లి ఉండాల్సింది. ఓ పక్క బెంగాల్ కాలిపోతుందని.. అయినా ముఖ్యమంత్రి పనిలేకుండా కూర్చున్నారన్నారు. సుప్రీం కోర్టు జోక్యంతో కేంద్ర బలగాలు భద్రతా ఏర్పాట్లను చేపట్టాయని.. అందుకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. మాఫియా ఖాళీ చేసే భూమిలో ఆసుపత్రులు నిర్మిస్తామని యోగి అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనమందరం నమ్మాలి. ఇది నవీన భారతదేశం.. 2047లో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా మారడాన్ని ఎవరూ ఆపలేరు అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు

# ఏపీ కేబినెట్ ఆమోదం



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం . ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం. 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదంవివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ప్లాట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

త్వరలోనే డిఎస్సీ నోటిఫికేషన్

మంత్రివర్గ నిర్ణయాలను నిమ్మల రామానాయుడు మీడియాకు వివరించారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 26న మత్స్యకార భరోసా సాయం కింద లబ్ధిదారులకు రూ.20వేలు పంపిణీ చేస్తామన్నారు. " రాష్ట్రంలో టీసీఎస్ విస్తరణకు భూమి కేటాయించాలని నిర్ణయించాం. ఐటీని విస్తరించేందుకు మంత్రి లోకేశ్ ప్రయత్నిస్తున్నారు. భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి ఇవ్వాలని నిర్ణయించాం. గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి కేటాయిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా మంచి రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలకు సామాజిక న్యాయం జరిగింది" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం: డోలా బాల వీరాంజనేయ స్వామి

ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సీ ఉపవర్గీకరణలో 200 పాయింట్ల రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. "విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటాం. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం రిజర్వేషన్ రానుంది. గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్ అమలు కానుంది. గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుంది" అని తెలిపారు.

మతకలహాలు సృష్టించాలని కుట్ర: హోం మంత్రి అనిత

రాష్ట్రంలో మతకలహాలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తితిదే ఛైర్మన్‌గా పని చేసిన వ్యక్తి చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. తితిదేపై బురద జల్లి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాపా నేత భూమన కరుణాకర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. తితిదేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈవో శ్యామలరావు కూడా చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ అంశంపై కొందరు కుట్రలు పన్ని ఆరోపణలు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను బయటపెట్టేసరికి నోళ్లు మూసుకున్నారు" అని అనిత అన్నారు.

## ప్రధాని మోడీ అమరావతి

# పర్యటన ఖరారు..

మొదటి పేజి తరువాయి



అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి పునఃనిర్మాణానికి కూడా రాబోతున్నారు.. మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన కొనసాగనుంది.. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోడీ పర్యటన ఉంటుందని మంత్రులకు తెలిపారు సీఎం చంద్రబాబు నాయుడు.. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ , హైకోర్టు, రహదారులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు ఏపీ సీఎం. ఇక, ఇంఛార్జ్ మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్న సీఎం. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.. వచ్చే నెల 2వ తేదీన ఏపీకి ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు సీఎం చంద్రబాబు.. కొన్ని విషయాల్లో ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తిరుపతిలో గోవుల మృతిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని తిప్ప కొట్టడంలో మంత్రులు వైఫల్యం చెందారని మండిపడ్డారు సీఎం.. దేశంలో ఎక్కడా అమలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు మనం అమలు చేస్తుంటే.. ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు విఫలం అవుతున్నారని దుయ్యబట్టారు.. జిల్లాలు యూనిట్‌గా తీసుకొని పార్టీ.. ప్రభుత్వం.. మంత్రులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలన్నారు.. అంతేకాదు.. ఎన్నిసార్లు చెప్పినా మంత్రుల తీరిలో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు.. వ్యక్తిగత కార్యదర్శులు, వోఎస్‌డీలు చేస్తున్న తప్పులు ప్రభుత్వంపై పడుతున్నాయి.. వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించారు సీఎం చంద్రబాబు.

# సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్!



ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి మరోసారి చిక్కులు తప్పేలా లేదు. నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక మలుపు తిరిగింది. మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కీలక ముందడుగు వేసింది .పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు పలువురు ప్రముఖ కాంగ్రెస్ నేతలపై అధికార యంత్రాంగం ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇటీవలే రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకోవాలని నోటీసులు జారీ చేసిన కొన్ని రోజులకు ముందు చోటుచేసుకోవడం గమనార్హం. తాజాగా ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ కేసు వ్యవహారం మరింత రాజకీయంగా వేడెక్కించనుంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ తన ఫిర్యాదును నమోదు చేసింది. నేషనల్ హెరాల్డ్ అనే పత్రిక ద్వారా నిధుల దుర్వినియోగం జరిగినట్టు ఈడీ ఆరోపిస్తోంది. యువ్ ఇండియా, అసోసియేటెడ్ జర్నల్స్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల్లో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అక్రమంగా నిధులు మళ్లించినట్టు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ కేసు కేంద్రంగా నిలిచిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ప్రచురిస్తోంది. ఈ సంస్థ యాజమాన్యం యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు చెందింది. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్‌లు ఇందులో కీలక భాగస్వాములుగా ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ సమాచారం ప్రకారం, గతంలో నవంబర్ 2023లోనే రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులతో పాటు, రూ.90.2 కోట్ల విలువైన %ఈజీ% షేర్లను కూడా జప్తు చేసింది. ఇది నేరపూరిత లాభాలను భద్రపరచేందుకు, అభియుక్తులు వాటిని విక్రయించి పారిపోయే అవకాశాలను నిరోధించేందుకు తీసుకున్న చర్యగా తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో ముడిపడి ఉన్న నేర లాభాల మొత్తం రూ.988 కోట్లు అని ఈడీ అంచనా వేసింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై ఈనెల 25న కోర్టు విచారణ చేపట్టనుంది. రౌస్ అవెన్యూ కోర్టు తదుపరి చర్యలపై రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఈ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈడీ ఎదుట హాజరైన సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తోంది. ఇది కేంద్రం బహిరంగంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తోందని విమర్శిస్తోంది. తాజా ఛార్జ్‌షీట్ దాఖలుతో ఈ వ్యవహారం మరింత వేడెక్కే అవకాశముంది.

## హార్వర్డ్‌కు షాకిచ్చిన ట్రంప్...

# 2.2 బిలియన్ డాలర్ల నిధులు నిలిపివేత

అమెరికా: అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థ హార్వర్డ్ విశ్వవిద్యాలయం, ఫెడరల్ ప్రభుత్వం మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. క్యాంపస్‌లో యూదు వ్యతిరేకతను (యాంటీ-సెమిటిజం) సమర్థవంతంగా అరికట్టడంలో విఫలమైందని ఆరోపిస్తూ , అందుకు అవసరమైన సంస్కరణలను చేపట్టాలన్న ప్రభుత్వ డిమాండ్లను తిరస్కరించినందుకుగాను, ట్రంప్ యంత్రాంగం హార్వర్డ్‌కు భారీ షాక్ ఇచ్చింది. విశ్వవిద్యాలయానికి అందాల్సిన సుమారు 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 18,300 కోట్లు) ఫెడరల్ నిధులను నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. దీనికి అదనంగా, 60 మిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను సైతం తక్షణమే స్తంభింపజేసింది. విశ్వవిద్యాలయ పాలనా విధానాలు, నియామక ప్రక్రియలు, ప్రవేశాల పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని, వివాదాస్పదమవుతున్న వైవిధ్య (డైవర్సిటీ) కార్యాలయాలను మూసివేయాలని, అంతర్జాతీయ విద్యార్థుల నేపథ్య పరిశీలనలో ఇమిగ్రేషన్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, అలాగే విద్యార్థులు-అధ్యాపకుల అభిప్రాయాలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలనేవి వైట్‌హౌస్ ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. అయితే, ఈ డిమాండ్లను హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు అలాన్ గార్బర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇవి విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తిపై, విద్యా స్వేచ్ఛపై దాడి చేయడమేనని ఆయన అభివర్ణించారు. తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించుకుంటామని, ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని విద్యార్థులు, అధ్యాపకులకు రాసిన లేఖలో ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఎవరిని నియమించుకోవాలనేది ప్రభుత్వం నిర్దేశించజాలదని ఆయన తేల్చిచెప్పారు. హార్వర్డ్ మొండి వైఖరి, అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థలలో పాతుకుపోయిన 'మేము దేనికైనా సమర్థులమనే మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని 'ట్రంప్ జాయింట్ టాస్క్ ఫోర్స్ టు కంబాట్ యాంటీ-సెమిటిజం' విమర్శించింది. ఫెడరల్ నిధులు పొందుతున్న సంస్థలు పౌర హక్కుల చట్టాలను గౌరవించాల్సిందేనని గుర్తుచేసింది. గతేడాది ఇజ్రాయెల్-గాజా యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో చెలరేగిన నిరసనలు, యూదు విద్యార్థుల భద్రతపై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. గతంలో ఇవే ఆరోపణలపై కొలంబియా విశ్వవిద్యాలయానికి 400 మిలియన్ డాలర్ల నిధులు నిలిపివేసినప్పుడు, ఆ సంస్థ ప్రభుత్వ డిమాండ్లకు అనుగుణంగా క్రమశిక్షణా చర్యలు, భద్రతా సంస్కరణలకు అంగీకరించింది. కానీ, హార్వర్డ్ ప్రతిఘటన వైఖరిని అవలంబిస్తోంది. ఈ ప్రతిష్టంభన, అమెరికాలో విద్యాసంస్థల స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణల మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యతపై మరోమారు దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది.

## ప్రధాని మోదీతో కరణం మల్లీశ్వరి భేటీ..

# ఆమె కృషిని కొనియాడిన ప్రధాని

ఢిల్లీ: ఒలింపిక్స్‌లో పతకం సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ప్రముఖ వెయిట్‌లిఫ్టర్, తెలుగు తేజం కరణం మల్లీశ్వరితో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. హర్యానాలోని యమునానగర్‌లో సోమవారం ఈ భేటీ జరిగినట్లు ప్రధానమంత్రి స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను, ఫొటోలను ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పంచుకున్నారు. ఒక క్రీడాకారిణిగా కరణం మల్లీశ్వరి సాధించిన విజయాలు దేశానికి ఎంతో గర్వకారణమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆమె అద్భుతమైన ప్రతిభ, పట్టుదలతో అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి గొప్ప పేరు తెచ్చిపెట్టారని కొనియాడారు. క్రీడల్లో ఆమె ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడా రంగంలో వ్యక్తిగత విజయాలతో పాటు, భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కరణం మల్లీశ్వరి చేస్తున్న కృషిని కూడా ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. యువ అథ్లెట్లకు మార్గదర్శకత్వం వహిస్తూ, వారిని ప్రోత్సహించడానికి ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఎంతో అభినందనీయమని ఆయన తెలిపారు. క్రీడాకారిణిగా, మార్గదర్శిగా ఆమె సేవలు దేశానికి ఎంతో విలువైనవని మోదీ అభిప్రాయపడ్డారు.

# ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్ అణ్వాయుధాల సంగతి మరచిపోండి..

అమెరికా: అణ్వాయుధాలను తయారు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని ఇరాన్ ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటానికి వీల్లేదని ఆయన తేల్చిచెప్పారు. తమకున్న సమాచారం మేరకు ఇరాన్ అణ్వాయుధ తయారీ దాదాపుగా పూర్తిచేసిందని తెలిపారు. ఈ కారణంగానే న్యూక్లియర్ డీల్ ను కుదుర్చుకోవడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఒకవేళ తమ హెచ్చరికలను పెడచెవిన పెట్టి అణ్వాయుధాలను తయారుచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఇరాన్ అణ్వాయుధ తయారీ కేంద్రంపై సైనిక చర్యకూ వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. గత శనివారం అమెరికా, ఇరాన్ ల మధ్య న్యూక్లియర్ డీల్ కు సంబంధించి ఒమన్ వేదికగా చర్చలు జరిగాయి. చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. అమెరికాతో అణ్వాయుధ ఒప్పందానికి సంబంధించి చర్చలు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని పేర్కొంది. రెండో దశ చర్చలు వచ్చే శనివారం రోమ్ వేదికగా జరుగుతాయని తెలిపింది. కాగా, ఇరుదేశాల మధ్య అణ్వాయుధ ఒప్పందానికి సంబంధించి చర్చలు ఒబామా కాలం నుంచే జరుగుతున్నాయని, బైడెన్ హయాంలోనూ చర్చలు జరిపినా ఒప్పందం మాత్రం కుదరలేదని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఒప్పందంపై సంతకం చేయడానికి ఆలస్యం చేస్తోందని తాజాగా ట్రంప్ ఆరోపించినట్లు సమాచారం.

## ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి...

# ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం

ఢిల్లీ: కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబై నగరాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని, దేశ రాజధానిలో మూడు రోజులు ఉంటే అనారోగ్యం పాలవడం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ రాజధానిలో నివసించే ప్రజల ఆయుర్దాయం పదేళ్లు తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఆర్థిక వ్యవస్థకు ఇచ్చే ప్రాధాన్యతను పర్యావరణానికి కూడా ఇవ్వాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. వాహనాలలో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమని అన్నారు. భారతదేశం సుమారు రూ. 22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందని గుర్తు చేశారు. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని భారత్ ముందుకు సాగుతోందని అన్నారు. విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టి సారించిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16 శాతం ఉన్నాయని అన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి మన ఖర్చులను సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# స్టాలిన్ కీలక నిర్ణయం...

తమిళనాడు: వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌తో విభేదాల నెలకొన్న నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫార్సు చేయనుంది. పలు బిల్లుల ఆమోదంపై తమిళనాడు గవర్నర్, ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఉన్నాయి. గవర్నర్ ఆమోదం లేకుండానే 10 చట్టాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ బిల్లులపై సుప్రీంకోర్టులో సైతం స్టాలిన్ ప్రభుత్వానికి ఊరట లభించింది. పెండింగులో పెట్టిన 10 బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని భారత అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం స్వయంప్రతిపత్తిపై సూచనల కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం.

# అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం

ఢిల్లీ: పాఠశాలల అధిక రుసుముల వసూళ్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందించారు. పాఠశాలల్లో ఏకపక్షంగా ఫీజులు పెంచితే ఉపేక్షించేది లేదని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల్లో ఫీజుల పెంపును నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. మోడల్ టౌన్‌లోని క్వీన్ మేరీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురి చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం కొందరు విద్యార్థులను బహిష్కరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు ముఖ్యమంత్రి రేఖా గుప్తా దృష్టికి తీసుకురావడంతో ఆమె వెంటనే స్పందించారు. పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం, విద్యార్థుల తల్లిదండ్రులను వేధించడం వంటి చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ఫీజుల పెంపు విషయంలో పాఠశాలల యాజమాన్యాలు కొన్ని నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అసాధరణంగా ఫీజులు పెంచరాదని, విద్యార్థులను అకారణంగా వేధించరాదని హితవు పలికారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలకు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అవసరమైతే రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పిల్లల హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ప్రతి బిడ్డకు న్యాయం, గౌరవం, సరైన విద్య లభించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి దర్యాప్తు జరపాలని, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

# బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు..

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం అప్పులు చేసి, వాటిని తీర్చే దారిలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇదే విషయమై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తాజాగా యువతను హెచ్చరించారు. ఈ సందర్భంగా తన గన్‌మ్యాన్ ఘాతుకాన్ని ఆయన బయటపెట్టారు. తన వద్ద గన్‌మ్యాన్‌గా పనిచేసిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో చాలా డబ్బు పోగొట్టుకున్నాడట. పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయాడు. వాటిని తీర్చేందుకు దారిలేక భార్యతో పాటు 5, 7 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు పిల్లలను తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత అదే గన్‌తో తాను కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని హరీశ్ రావు పేర్కొన్నారు. కనుక బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. ఏ షార్ట్‌కట్ మనకు డబ్బు ఇవ్వదని ఆయన అన్నారు. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు వారు డబ్బులు సంపాదించుకోవడానికి వాటిని తీసుకొచ్చారు తప్పితే.. మనల్ని గెలిపించి లక్షాధికారులు చేయడానికి కాదని మాజీ మంత్రి తెలిపారు. అందుకే యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని ఆయన సూచించారు.

# ఏపీవో మా పై కక్ష సాధింపు తగదు - క్షేత్ర సహాయకురాలు నాగమణి



నార్పల/ జనం న్యూస్: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులలో జరుగుతున్న పనుల పైన, గత పది వారాల నుంచి పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాల పైన, ఉపాధి హామీ పని క్షేత్ర సహాయకురాలికి ఏపీవో చేస్తున్న అధికార దుర్వినియోగం గురించి పాత్రికేయుల సమావేశాన్ని క్షేత్ర సహాయకురాలు నాగమణి మరియు ఉపాధి కూలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తమతో క్షేత్ర సహాయకురాలు, సంబంధిత అధికారులు ఎవరూ కూడా డబ్బులు ఇప్పించుకోలేదని, అవసరమైతే ప్రతిరోజూ సంబంధిత అధికారులు క్షేత్ర పర్యవేక్షణ చేయండి కానీ మా పొట్టను కొట్టకండని కూలీలు వాపోయారు. బుధవారం రోజున (09.04-2025) ఏపీడి క్షేత్ర పర్యవేక్షణకు వచ్చిన రోజున పులసలనూతల గ్రామంలో దేవర ఉండడం వలన ఆరోజు కూలీలు పనులకు హాజరవ్వలేదని, మరుసటి రోజు నుంచి వరుస క్రమంగా పనులకు వస్తున్నామని తెలిపారు. అలాగే ప్రస్తుతం నార్పల క్షేత్ర సహాయకురాలైన నాగమణి నుంచి మాకు ఎటువంటి ఇబ్బంది లేదని, తాము ఎవరికి డబ్బులు ఇవ్వలేదని, పెండింగ్ లో ఉన్న పది వారాల బకాయిలను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని తెలిపారు. అనంతరం నార్పల మండల క్షేత్ర సహాయకురాలు నాగమణి మాట్లాడుతూ తాము ఉపాధి కూలీలకు పనులను కల్పించుటలో ఏపీవో చాలా ఇబ్బంది పెడుతున్నాడని, పనులను కల్పించమని ఆ అధికారి వద్దకి వెళితే పనులను కల్పించడం లేదని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రస్తుతం ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న అధికారి గతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులలో అవకతవకలు కనిపించలేదా, పనులు చేయని వారికి బిల్లులు పెట్టలేదా అని ఏపీవోని ప్రశ్నిన్నామని తెలిపారు. తాము కూలీలనుంచి ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనులను కల్పిస్తున్నానని తెలుపుతూ తమ ఎదుగుదలని చూసి ఓర్వలేక కొందరు తమ పైన అసత్య ఆరోపణలను చేస్తున్నారని, చేతనైతే అసత్య ఆరోపణలను ఆధారాలతో సహా రుజువు చేయాలని తెలిపారు.



## ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



రాజవొమ్మంగి, ఏప్రిల్ 15 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక అల్లూరి సెంటర్ వద్ద శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మించేందుకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసినాయుడు అధ్యక్షతన భూమి పూజ నిర్వహించారు ఈకార్యక్రమంలో పెద్దిరాజు మాట్లాడుతూ బస్ షెల్టర్ నిర్మాణానికి,ఆలయ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు ఈ నిర్మాణ పనులకు దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో దంతులూరి శివాజీ రాజు మలిరెడ్డి గోవింద్ బివిఎస్ఎన్ గుప్తా సిగిరెడ్ల వీరబాబు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రాలు వినియోగించుకోండి సూపర్వైజర్ శ్యామల



పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉచితంగా చిన్నారులకు, గర్భిణీలకు ,బాలింతలకు అందిస్తున్న అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలని పొన్నూరు ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల పేర్కొన్నారు. మంగళవారం 7వ వార్డు డివిసి కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణీలు ,బాలింతలు ఆకుకూరలు ,పాలు, గుడ్లు తోపాటు చిరుధాన్యాలు తీసుకోవడం వలన రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో ఉచితంగా ఇచ్చే గుడ్లు, పాలు ,ఆకుకూరలను తీసుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని అవగాహన కల్పించారు. గర్భిణీలు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు గంటలోపు తాగించాలని దీంతో బిడ్డ లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం వార్డులో ర్యాలీ ప్రదర్శన నిర్వహించి పక్షోత్సవాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు.కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలతో పాటు బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

## అప్రమత్తతే ప్రమాదాల నివారణ..



పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం అగ్నిమాపక కేంద్రం అధికారి కే .ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సెంటర్లో అగ్ని ప్రమాదాల నివారిణ, తీసుకును జాగ్రత్త చర్యలపై డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అధైర్య పడకుండా నివారణ చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం రైల్వే స్టేషన్, బస్టాండ్, జి బి సి రోడ్డు ప్రాంతాలలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు పట్టణములోని పలు ప్రాంతాలలో నిర్వహించి ప్రజలకు అగ్నిప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా నివారణ చర్యలు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరిస్తామని అధికారి ప్రసాదరావు తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు 101,112 ఫోన్ నెంబర్లకు వెంటనే తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత ఉపకరణాలు పంపిణీ.




గుంటూరు (జనం రిపోర్టర్) పాఠశాల విద్యాశాఖ - సమగ్ర శిక్షా - గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో బ్రాడిపేట శాంతినికేతన్ పాఠశాలలో "ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యి, పిల్లలకు పరికరాలు పంపిణీ చేసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మరియు జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక మరియు తదితరులు పాల్గొన్నారు.



# గుంటూరు జిజిహెచ్ లో నిర్లక్ష్యం. ఏకో పరీక్ష దగ్గర పేషెంట్లు పడిగాప్పులు



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిజిహెచ్ హాస్పటల్లో డాక్టర్ల నిర్లక్ష్యం. అవస్థలు పడుతున్న పేషెంట్లు. ఉదయం 9 గంటల నుంచి పడిగాపులు మూడు రోజులు సెలవు దినం కావడంతో పేషంట్లతో నిండిపోయిన జిజిహెచ్ హాస్పిటల్. ఎమర్జెన్సీ పైన ఏకో పరీక్షలు గది దగ్గర పడిగాపులు కాస్తున్న పేషెంట్లు అవస్థలు పడుతున్న పేషెంట్లు. సెక్యూరిటీ గార్డలు అతి ఉత్సాహం పేషంట్లపై దురుసు ప్రవర్తన. రోజుల తరబడి హాస్పిటల్ చుట్టూ తిప్పించుకుంటున్నారని పేషెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకో పరీక్ష చేయటానికి డేట్లు ఇస్తామని చెప్పేసి పేషెంట్లకు సమాధానం. ఆల్రెడీ మూడు రోజులు సెలవు దినం కావడంతో అవస్థలు పడుతున్న పేషెంట్లు. పట్టించుకోని డాక్టర్లు వారి సిబ్బంది. ఎమర్జెన్సీ కేసులో ఉన్నప్పటికి కూడా సెలవు దినాలలో పట్టించుకోకుండా పరీక్షలు చేయకుండా నిర్లక్ష్యం వహించినటువంటి డాక్టర్లపైన సూపర్నెంట్ పైన తక్షణ చర్యలు తీసుకోవాలని పేషెంట్లు ఆవేదన. ఒక పక్కన సెక్యూరిటీ సిబ్బంది అతి ఉత్సాహం పేషంట్లను బయటికి వెళ్లి పోవాలని గొడవకు దిగుతున్న సెక్యూరిటీ సిబ్బంది సుమారు 300 పేషంట్ల పైన వార్డులో పడిగాపులు సరైన విధానం లేక అవస్థలు పడుతున్న పేషెంట్లు కూర్చోవడానికి కుర్చీలో లేక ఇబ్బంది పడుతున్నటువంటి పేషెంట్ తాలకు బంధువులు పేషెంట్లు గవర్నమెంట్ హాస్పటల్ కావటంతో ఎవరికి చెప్పుకోలేని స్థితిలో ఉన్నటువంటి పేద ప్రజలు పేషెంట్లు తక్షణం ప్రభుత్వం దీనిపైన చర్యలు తీసుకొని కలెక్టర్ గారు నిర్లక్ష్యం వహించినటువంటి సిబ్బంది పైన చర్యలు తీసుకోవాలని పేషెంట్ తాలూకా బంధువులు పేషెంట్లు కోరుకుంటున్నారు సరైన పద్ధతిలో వైద్యం ఉండేలాగా చూడాలని కోరుకుంటున్న పేషెంట్లు

## కుషాయిగూడలో దారుణం.. వృద్దురాలిని హత్య చేసి శవంపై డాన్స్ చేసిన యువకుడు



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మర్చి 15 : ( జనం రిపోర్టర్ ) : హైదరాబాద్ - కుషాయిగూడలో షాపు అద్దె చెల్లించాలని యువకుడిని అడిగిన వృద్ధురాలు కమలాదేవి(70).ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ రావడంతో, ఈనెల 11న కమలాదేవికి ఉరివేసి హత్య చేసిన యువకుడుఅనంతరం ఆమె మృతదేహంపై డాన్స్ చేస్తూ వీడియో తీసి స్నేహితులకు పంపి, ఇంటికి తాళం వేసి పారిపోయిన యువకుడుఇంట్లో నుండి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు.. ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.శవంపై డాన్స్ చేస్తూ తీసిన వీడియోలు బెంగళూరులో వైరల్ కావడంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ముగ్గురిలో ఒక మైనర్ బాలుడు ఉన్నట్లు సమాచారం.

## కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చలివేంద్రం ప్రారంభం.



పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా నిడుబ్రోలు కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం చలివేంద్రాన్ని బొకినాల విజయ రత్న చార్య ప్రారంభించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు మిత్రులకు సహకారంతో కాట్రగడ్డ విజయ్ కుమార్ చేసిన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు.కెవిఆర్ ట్రస్ట్ కాట్రగడ్డ విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎండాకాలం ప్రజలకు దాహం తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రం ప్రారంభోత్సవం చేయడం ఎంతో ఆనందకరమ ని ఇప్పటివరకు వికలాంగులకు అవసరాల్లో ఉన్నవారికి సాయం చేస్తూ వచ్చాను కానీ మొదటిసారి చలివేంద్రం ప్రారంభం చేయడానికి ఎంతో ఆనందంగా ఉంది. ఇది మొదలుకొని పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.ప్రతి సంవత్సరం చలివేంద్రం దాతలకు,శ్రేయోభిలాషులకు ఆప్తులకు బంధువులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశాడు. కెవిఆర్ ట్రస్ట్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి దాతలు ప్రోత్సహిస్తారని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో పాస్టర్ శ్యాం ప్రసాద్ యాతాటి కిషోర్ ,కుటుంబ సభ్యులు ,బంధువులు మిత్రులు పాల్గొన్నారు.

## ఏపి రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా నార్పల మారుతి నరసింహ



నార్పల ( జనం రిపోర్టర్ ) : ఆంధ్రపదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మండల కేంద్రమైన నార్పలకు చెందిన రిటైర్డ్ విఆర్ఓ రామారావు కుమారుడైన నార్పల మారుతి నరసింహ ఎంపికయ్యారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏలూరులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మారుతి నరసింహ మాట్లాడుతూ తనను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంపిక చేసిన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ సోదరులందరికీ అందుబాటులో ఉంటూ, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా ఎంపికైన మారుతి నరసింహను పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అకాల వర్షం వలన కూలీల ఇల్లు - బాధితునికి బాసటగా నిలిచిన ఆకుల విజయకుమార్ బాబు



నార్పల ( జనం రిపోర్టర్ ) : మండల పరిధిలోని తుంపెర గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల ఇండ్లు పడిపోయిన బాధిత కుటుంబానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయకుమార్ ఏ బాబు మంగళవారం తుంపెర కు వెళ్లి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. వివరాలలోకి వెళితే సోమవారం సాయంత్రం మండలంలోని కొన్ని గ్రామాలలో అకాల వర్షం కురిసింది. అందులో భాగంగా తుంపెర గ్రామంలోని బీసీ కాలనీ లో కురిసిన వర్షానికి వడ్డే సంపంగి చెన్నమ్మకి చెందిన ఇంటిమీద పెద్ద చెట్టు పడి ఇళ్ళు కూలిపోయింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయకుమార్ బాబు భాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి, పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి బాసటగా నిలిచారు. ఆర్థిక సాయం పొందిన బాధితురాలు తెలుగుదేశం పార్టీ నాయకుడికి ధన్యవాదములు తెలిపారు.



# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ లో స్థానం సాధించిన కొప్పురావూరు నివాసి




పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : కొప్పురావూరు నివాసిఅయిన స్ఫూర్తి మహిళా సంక్షేమ అభివృద్ధి సంస్థ ప్రెసిడెంట్ :టి. ఉషారాణి.%ఎ/శ%. కూర గంటి సుధాకర్ 17 దేశాల నుండి డిసెంబర్ ఒకటవ తేదీన ఒకటి 1/2 /2024. సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు హీల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు మాస్టర్ అగస్టీన్ దండంగి వారి ఆధ్వర్యంలో వీడియో రికార్డు చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరిగింది గంటసేపు నాన్ స్టాప్ కీబోర్డ్ 1090 మంది బుక్ టైం లో ప్లే చేసినారు వీడియోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ వారు వీక్షించి ఎంపిక చేసినారు సోమవారం ది 15/ 4 /2025. హైదరాబాద్ మణికొండ లో నిర్వహించిన ప్రోగ్రాం లో హీల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ దండంగి మరియు ముఖ్య అతిథులు బ్రదర్ అనిల్ మరియు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్.%ూఎయబఎఱఛశీతీ.వీతీ%. ఆనంద్ రాజేంద్రన్ వారి చేతుల మీదగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ మరియు మెడల్ బహుకరించడం జరిగినది స్ఫూర్తి మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ సంగీతం పట్ల మక్కువ పెంచాలని ఆనంద జీవితానికి మార్గాలను చూపాలని భారతదేశం లో పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో విధంగా దేశానికి సేవలు చేయాలని కోరుచున్నారు . ఉషారాణి

## సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ ...

రేపల్లె ( జనం రిపోర్టర్ ) : సీఎం సహాయనిది పేదల ఆరోగ్య అవసరాలకు వరమని మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళ వారం టీడీపి కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న సుమారు 70 మంది పేదలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రత్యేక చొరవతో మంజూరైన రూ.88,55,357 రూపాయల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిది ద్వార వైద్య ఖర్చులకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. కుటుంభంలో ఒకరు అనారోగ్యంపాలైతే, కుటుంభం మొత్తం కలత చెందుతుందని చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎన్నికల సందర్భంగా ప్రతి కుటుంబానికి పెద్దకొడుకు గా ఉంటానని ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

## మండలంలో నేటి నుంచి 31 వరకు దోమల మందు స్ప్రేయింగ్ కార్యక్రమం. సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్



రాజవొమ్మంగి, ఏప్రిల్ 15 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలోని రాజవొమ్మంగి,జడ్డంగి,లాగరాయి మూడు పి హెచ్ సిల్లో ఉన్న గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం దోమల మందు స్ప్రేయింగ్ నిర్వహించడం జరుగుతుందని మండల మలేరియా అధికారి సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ తెలిపారు స్ప్రేయింగ్ సమయంలో సిబ్బందికి స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధులు,సర్పంచ్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు అలాగే మండలంలోని పాఠశాలలు,హాస్టల్స్ ల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమల మందు స్ప్రేయింగ్ చేయడం జరుగుతుందన్నారు

## విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పెందుర్తి పోలీస్ స్టేషన్ తప్పిపోయిన వివాహిత మరియు ఏడునెలల శిశువు ట్రేస్ భర్తకు అప్పగింపు



( జనం రిపోర్టర్ ) : తేదీ 14.04.2025 న పెందుర్తి, బాలాజీ నగర్ ప్రాంతానికి చెందిన సుమారు 30 సంవత్సరాల వయస్సు గల మహిళ, తన ఏడునెలల ఆడ శిశువుతో కలిసి ఇంటి నుండి ఎటువంటి సమాచారం లేకుండా బయటకు వెళ్లిపోయిన ఘటనపై ఆమె కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్కి ఫిర్యాదు చేసారు.ఫిర్యాదు ఆధారంగా పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ కె.వి సతీష్ కుమార్ చే తక్షణమే కేసు నమోదు చేయబడింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, సాంకేతిక ఆధారాలు (సీసీ కెమెరా ఫుటేజీ, మొబైల్ ట్రాకింగ్ మొదలైనవి) మరియు విశ్వసనీయ సమాచారం ఆధారంగా చర్యలు తీసుకొని, తప్పిపోయిన మహిళను మరియు ఆమె కుమార్తెను కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు నగరంలో సురక్షితంగా ట్రేస్ చేయగలిగారు.తరువాత సంబంధిత న్యాయపరమైన విధానాలు పూర్తి చేసిన అనంతరం, మహిళను మరియు ఆమె ఏడునెలల కుమార్తెను వారి భర్తకు అప్పగించడమైనది.ఈ ఘటనలో వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా తల్లీ-కూతుళ్లను సురక్షితంగా ట్రేస్ చేసిన పెందుర్తి పోలీసులకు, తప్పిపోయిన వివాహేత కుటుంబ సభ్యులు మరియు చుట్టుపక్కల పౌరులు అభినందనలు తెలియజేశారు.

## దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి . మనసు అనాధాశ్రమానికి నిత్యవసర వస్తువులు




.సింహాచలం. ( జనం రిపోర్టర్ ) : దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, దయగల హృదయమే దైవ మందిరం అని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు,నేవల్ డాక్ యార్డ్ అసోసియేషన్ (కేటీబీ )గౌరవ అధ్యక్షులు,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు అన్నారు. ఇక్కడ సింహాచలం రోడ్ లో ఉన్న మనసు అనాధాశ్రమానికి మంగళవారం గంట్ల శ్రీను బాబు కుటుంబ సభ్యులు చేతులు మీదుగా నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలతో పాటు దయగల దాతలు కూడా అత్యంత కీలకమన్నారు. వారు కూడా ముందుకు వచ్చినప్పుడే కొంత మేరకు పేదరికం తగ్గ ముఖము పడుతుంది అన్నారు..మనసు ఆశ్రమంలో సుమారు 27 మంది చిన్నారులు ఉన్నారని వారంతా వేరువేరు పాఠశాలల్లో ఉన్నత విద్యాభ్యాసం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వాలు మరిన్ని పథకాలు అమలు చేయాలన్నారు. పిల్లల పట్ల నిర్వాహకులు తీసుకుంటున్న శ్రద్ధను అభినందించారు. ప్రతీ ఏటా కొంత సామాగ్రి అందచేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సింహగిరి గ్యాస్ ఏజెన్సీ యజమాని గంట్ల కిరణ్ బాబు,మారుతి. కళ్యాణ మండపం అధినేత తిరుమల రెడ్డి సుధీర్. ప్రవీణ్, టీడీపీ నాయకులు శ్రీనివాస్ పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా చైల్డ్ కేర్ సభ్యులు



రేపల్లె , ( జనం రిపోర్టర్ ) : చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ తనిఖీలు లో భాగంగా డిస్ట్రిక్ట్ ఇన్స్పెక్షన్ టీమ్ బేతేస్తా, న్యూ అభ్యుదయ సేవ సంగం, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ను తనిఖీ చేసి రిజిస్టర్లు, స్టాక్, పిల్లలకు కల్పించే సౌకర్యాలు, మెనూ, స్టాఫ్ డీటెయిల్స్ మొదలగువాటిని పరిశీలించి సూచనలు, మార్పులు తెలియజేయట మైనది. ఈ కార్యక్రమంలో డిపిఓ పి సౌందర్య సిడిపిఓ ఎం సుచిత్ర డిసిపిఓ పి పురుషోత్తం రావు ఎల్సిపిఓ మౌనిక పి ఓ ఎన్ ఐ సి జి కృష్ణ పిఓఐసి జీ స్వప్న ప్రియ పాల్గొన్నారు

# సాగునీరు విడుదల చేయాలని జూరాల ఆయకట్టు రైతుల ఆందోళన

## రైతుల ధర్నాతో ప్రాజెక్టుపై రాకపోకలకు అంతరాయం సీఐ, ఏఈ, హామీల తో ఆందోళన విరమించిన రైతులు




అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : పంట చివరి దశలో ఉన్న సమయంలో జూరాల ఎడమ కాలువకు అధికారులు సాగునీరు నిలుపుదల చేశారని జూరాల ఎడమ కాలువ ఆయకట్టు రైతులు మంగళవారం ప్రాజెక్టుపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మకూరు మండలంలోని గుంటి పల్లి తిప్పడం పల్లి ఆరేపల్లి తూంపల్లి కత్తే పల్లి వీర రాఘవపురం దేవరపల్లి మోట్లంపల్లి అమరచింత మండలం నందిమల్ల గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది రైతులు ప్రాజెక్టుపై చేరుకొని ఎడమ కాలువ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా చేపట్టారు. ఏప్రిల్ చివరి మాసం వరకు సాగునీరు విడుదల చేస్తామని అధికారులు చెప్పినందుకే తమ పంటలు వేసామని రైతులు వాపోయారు. పంట చివరి దశలో ఉండగా సాగునీరు ను అధికారులు నిలిపివేయడంతో తమ పంటలు ఎండిపోయి నష్టాల పాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఈ ఈ వచ్చి హామీ ఇచ్చేవరకు ఇకనుంచి కదిలేది లేదని బయట ఇచ్చారు. రైతుల మెరుపు ధర్నాతో ప్రాజెక్టుపై ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు సిఐ శివకుమార్ అమరచింత ఎస్సై సురేష్ ఆందోళన చేస్తున్న రైతుల దగ్గరికి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. దీంతో సీఐ శివకుమార్ ఇరిగేషన్ ఏఈ ఆంజనేయుని ఆందోళన చేస్తున్న రైతుల దగ్గరికి పిలిపించారు వారితో కలిసి మాట్లాడించారు. సాయంత్రం కలెక్టర్ తో మాట్లాడి నీటి విడుదలకు కృషి చేస్తామని తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేష్ సిపిఎం నాయకులు కురుమూర్తి రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికారు.



# బిజెపి జెండాకు అవమానం జరిగిందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

## ఎస్సై తో మాట్లాడిన ఎంపీ డీకే అరుణ

అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో ఊరేగింపు జరుపుతూ కొందరు బిజెపి జెండాను కిందకు లాగి జండా కర్రను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని అమరచింత నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం అర్థ రాత్రి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ బిజెపి జండా కట్ట వద్దకు చేరుకోగానే జెండా కర్రను పట్టుకొని జెండాను కిందికి లాగారని ఎస్సై సురేష్ కు నాయకులు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ సురేష్ తో పాలమూరు ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. జరిగిన సంఘటనపై పూర్వాపరాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి ఎంపీ సూచించారు.

# గోదావరిఖనిలో అంగరంగ వైభవంగా బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన నాయకులు...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 15. భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న ప్రపంచ మేధావి యుగపురుషుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్135వ. జయంతి సందర్భంగా తేదీ 14,ఏప్రిల్,2025న. గోదావరిఖని పట్టణంలో రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కోఆర్డినేషన్లో, ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.రామగుండం ఎమ్మెల్యే శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో, గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుండి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ముందుగల బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీ ర్యాలీ, డీజే పాటలతో దారి పొడవున జై భీమ్, జై భీమ్ అంటూ నినాదాలు డ్యాన్స్, ల తో హెూరు ఎత్తించిన, ట్రాన్స్ జెండర్స్డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వేరువేరుగా నివాళులర్పించిన, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ , చెన్నూరు శాసనసభ్యులు జి వివేక్ వెంకటస్వామి , మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ , పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్ జే అరుణశ్రీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి మల్లికార్జున సిపిఎం,జిల్లా కార్యదర్శి యాకయ్య , రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి , బొంతల రాజేష్ , అడ్డాల స్వరూప రామస్వామి , ముస్తఫా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిప్పారపు శ్రీనివాస్ , తాళ్ల పెల్లి యుగంధర్,పూలమాలవేసి ఘన నివాళులర్పించారు, అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడినారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ , కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కృష్ణయ్య , తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాతరి రాయమల్లు , వైస్ చైర్మన్ శనిగరపు రామస్వామి , ఏఐటీయూసీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ , బహుజన్ సమాజ్ పార్టీ రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు రవికుమార్ , ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ , కో కన్వీనర్లు పంజా అశోక్, గొర్రె నరసింహారావు , జిల్లా కో కన్వీనర్ లు, దుబాసి బొందయ్య గద్దల శశి భూషణ్ గ, నాతరి,ఆదిత్య, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సమ్మయ్య , ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు పుల్లూరి మహేందర్ ఎక్కిరాల రమేష్ ఒద్దిరాల రమేష్, బూడిద సంపత్ , మేకల సురేష్, కలువల మహేందర్ , రామగిరి రమేష్ , వివిధ దళిత సంఘాల నాయకులు బుష్పాక సంతోష్ , వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి, సర్కార్ గుడ్ న్యూస్



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, ఏప్రిల్ 15: ( జనం రిపోర్టర్ ) : తెలంగాణలో కొలువుల జాతర మొదలు కానుంది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ పూర్తికావడంతో సర్కారు ఇక ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టనుంది. ఏప్రిల్లోనే ఉద్యోగ ప్రకటనల జారీ ప్రక్రియ షురూ చేయాలని రేవంత్ రెడ్డి, సర్కారు భావిస్తోంది.విభాగాల వారీగా ఉద్యో గాల ఖాళీలను గుర్తించను న్నారు. తెలంగాణలో సుమారు 20,000 పోస్టులకు నియామక ప్రకటనలు వచ్చే ఛాన్స్ ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ప్రతి ఏడాది క్యాలెండర్ ప్రకటించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది.ఇప్పటికే 2024-25 ఏడాదికి ఉద్యోగ క్యాలెండర్ జారీ చేయగా, ఎస్సీ వర్గీకర ణకు అనుకూలంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడంతో ఈ ప్రక్రియ ముగిసే వరకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వబోమని చెప్పింది.ఈ కారణంగానే గత ఏడాది సెప్టెంబరు నుంచి నియామక ప్రకటనలు రాలేదు. ఇక ఈ నెల 14 నుంచి వర్గీకరణ అమల్లోకి రావడంతో ఇప్పుడు సర్కారు మళ్లీ ఉద్యోగాల ఖాళీల గుర్తింపు ప్రక్రియను షురూ చేయనుంది.ఆర్టీసీ, వైద్య విభాగాల్లో 10 వేల వరకు పోస్టులు ఉండే ఛాన్స్ ఉంది. మరోసారి గ్రూప్-1 ప్రకటన జారీ కోసం పోస్టులను అధికారులు గుర్తిస్తున్నారు. గ్రూప్ 4 ఉద్యోగాలు, పోలీసు విభాగంలోనూ భారీగా ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. గ్రూప్? 1,2,3,4 పోస్టులతో పాటు పోలీసు, గురుకుల రిక్రూట్మెంట్? బోర్డుల నుంచి కూడా నోటిఫికేషన్లు రానున్నాయి.ఏ సమయంలో ఏయే పరీక్షలు నిర్వహించాలన్న దానిపై సర్కారు త్వరలోనే క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్లోనే ?మహిళా శిశు సంక్షేమ శాఖలో14,236 అంగన్ వాడీ, ఆరోగ్య శాఖలో 4,000కు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు ఇవ్వాలని సర్కారు ప్రణాళిక వేసుకుంటోంది.

# : ఇవ్వాళ రాత్రి జపాన్ పర్యటనకు వెళ్ళనున్న సీఎం రేవంత్ రెడ్డి?



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, ఏప్రిల్ 15: ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ రాష్ట్రానికి పెట్టబడును ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు ఈరోజు రాత్రి వెళు న్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఈ నెల 16 నుంచి 22 వరకు అక్కడే పర్యటిస్తారు.ఈ రోజు సీఎల్పీ సమావేశం అనంతరం అన్ని పనులు ముగించుకొని సీఎం జపాన్ వెళ్లనున్నారు. ఈ పర్యటన లో సీఎం తో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు వెళ్లనున్నారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం జపాన్ పర్యటన కొనసాగనుంది. అలాగే ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్పో లో సీఎం రేవంత్ పాల్గొనను న్నారు. అనంతరం టోక్యోలో పెట్టుబడులపై పలు పారిశ్రామికవేత్తలతో సమావేశం జరగనుంది. జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత అభివృద్ధిపై జపాన్ వెళ్లిన సీఎం బృందం అధ్యయనం చేయనుంది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతో పాటు, అభివృద్ధిలో భాగ స్వామ్యం కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి వ్యాపారవేత్తలను, వివిధ సంస్థలను ఆహ్వానించను న్నట్లు తెలుస్తుంది.

# విమానాశ్రయాలకు దీటుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు




సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, ఏప్రిల్ 15: ( జనం రిపోర్టర్ ) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో త్వరలో జరగనున్న భారీ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలుగునుంది, విమానాశ్రయాలకు దీటుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టనుంది..దీంతో రైల్వే ఉన్నతాధి కారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు 100 రోజుల పాటు స్టేషన్ పరిధిలోని మొత్తం ఆరు ప్లాట్ఫామ్లను మూసి వేస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో దాదాపు 120 రైళ్లను చర్లపల్లి రైల్వే జంక్షన్ కాచి గూడ, నాంపల్లి, స్టేషన్లకు దారి మళ్లించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం లో భాగంగా భారీ స్కై కాంకోర్స్ లిఫ్టులు ఎస్కలేటర్లు,ఫుట్ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నా రు. ఇందులో 110 మీటర్ల వెడల్పు, 120 మీటర్ల పొడవుతో నిర్మించనున్న భారీ స్కై కాంకోర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అందులో రిటైల్ ఔట్లెట్స్, రెస్టారెంట్లు, కియోస్క్లు ఏర్పాటు చేయనున్నారు. ముందుగా ప్లాట్ఫాం నెం.2%-3, 4-%5లలో దాదాపు 50 రోజుల పాటు పనులు కొనసాగనున్నా యి. అక్కడ పనులు పూర్తి అయిన వెంటనే నాలుగు ప్లాట్ఫామ్స్ను ప్రారంభిస్తా రు.అనంతరం ప్లాట్ఫామ్ నంబర్ 10 వైపు పనులు ప్రారంభిస్తారు.

# సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావును అభినందించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.

## సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి




ఎటపాక ( జనం రిపోర్టర్ ) : ఖమ్మం జిల్లాలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మాస్టర్ టీం ఛాంపియన్షిప్ ను కైవసం చేసుకుంది. కాగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ లో కోచ్ జివి రామిరెడ్డి దగ్గర శిక్షణ తీసుకున్న 72 సంవత్సరాల డివి శంకర్రావు , గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కూడా వైద్యుల పర్యవేక్షణ లో మాస్టర్ 4 విభాగంలో 83 కేటగిరీలో 60 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించిన డివి శంకర్రావును భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం శాసనసభ పరిధిలోకి వచ్చే ప్రజలు అందరూ బైపాస్ సర్జరీ అయినా కానీ గోల్డ్ మెడల్ కొట్టిన డీవీ శంకర్రావు ని




ఆదర్శంగా తీసుకుని, తమకు అనారోగ్య సమస్యలు వున్నాయి అని చెప్పి వైద్యుల పర్యవేక్షణ లో రోజూ చేసే వ్యాయామానికి దూరంగా ఉండి మరింత అనారోగ్యం కు గురికావొద్దని తెలిపారు.బైపాస్ చేయించుకున్న వ్యక్తితో గోల్డ్ మెడల్ కొట్టించిన జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని మరియు అసోసియేషన్ సభ్యులను కూడా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా. శివరామకృష్ణ ప్రసాద్, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ మోడెం వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# : తొలగించిన మెడికల్ కాలేజ్ కార్మికులను వెంటనే వీధుల్లోకి తీసుకోవాలి, మంత్రి, ఎమ్మెల్యే లకు విజ్ఞప్తి....




రామగుండం ( జనం రిపోర్టర్ ) :రామగుండం:ఏప్రిల్ 15. మా విధులకు సంబంధం లేని పనులను సైతం మాతో చేపిస్తే మేము ఓపిక, సహనం వహించి చేసినప్పటికీ చిన్న, చిన్న కారణాలను చూపి రామగుండం మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ హిమబిందు తమను విధుల్లో నుంచి అ కారణంగా తొలగించారని మెడికల్ కాలేజ్ కాంట్రాక్టు కార్మికులు పేర్కొన్నారు. గోదావరిఖనిలోని మాతంగి కాంప్లెక్స్ లో గల రామగుండం నియోజకవర్గం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలు చెల్లించకపోగా, విధుల్లో తమని చిన్నచూపు చూస్తూ, శ్రమ దోపిడీ, మానసిక క్షోభకు ప్రిన్సిపల్ గురి చేస్తున్నారని, ఈ చిన్న ఉద్యోగం చేస్తే తప్ప మా కుటుంబాలు పూట గడవని స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే మాపట్ల ప్రిన్సిపల్ నిరంకుశంగా ప్రవర్తిస్తున్నందువల్ల, కొందరు కార్మికులు వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడే దుస్థితి నెలకొందన్నారు. కొందరు ఉద్యోగం మానేస్తుంటే వారి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్తవారిని ఉద్యోగంలో చేర్చుకొని, మమ్మల్ని రోడ్డుపాలు చేస్తుందని వారు ఆరోపించారు. ప్రిన్సిపల్ చర్యల వల్ల తాము ఆత్మహత్యలకు పాల్పడే స్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ విధుల విషయమై ప్రిన్సిపల్ ను సంప్రదిస్తే ఇష్టముంటే చేయండి, లేకుంటే మానేయండి అని తమను తొలగిస్తే అడిగే వారి లేరన్న అధికార అహంకారంతో తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ఉద్యోగాల తొలగింపు, ప్రిన్సిపల్ వేధింపులు, విధుల్లో, ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు తదితర అంశాలపై కలెక్టర్, లేబర్ కమిషనర్ ల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పై అంశాల విషయమై తగిన విచారణ జరిపి ప్రిన్సిపల్, కాంట్రాక్టర్ లపై తగిన చర్యలు తీసుకుని తమను వెంటనే విధుల్లోకి తీసుకుని మా కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ లను కోరారు.ఈ విలేకరుల సమావేశంలో నీలం బిక్షపతి, ఎండి మసూద్, మూల మౌనిక, బైరి అనిత

# త్రాగునీరు అందించండి మహాప్రభోనిజాంపట్నం పంచాయతీలి

## దర్వాజిపాలెం గ్రామ ప్రజలకు త్రాగునీటి కష్టాలు

### దాహార్తి తీరని గ్రామ ప్రజలుపట్టించుకోని సంబంధిత అధికారులు

### పలుమార్లు మొరపెట్టుకున్న ఫలితం శూన్యం ప్రజల ప్రాణాలతో చెల్లగాటమ



నిజాం పట్నం ( జనం రిపోర్టర్ ) : నిజాంపట్నం పంచాయతీ దర్వాజిపాలెం గ్రామంలో గ్రామ ప్రజలు సురక్షిత మంచినీటి పథకం ద్వారా చుక్క నీరు కూడా అందటం లేదని నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవికాలం నీరు అందక దాహార్తి కోసం కొన్ని కిలోమీటర్ల దూరం వెళ్లి త్రాగునీరు తీసుకోవలసి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి మా ధరేష్ పాలెం గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించాలని వారు కోరుచున్నాను.

# సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ ...



రేపల్లె , ( జనం రిపోర్టర్ ) : సీఎం సహాయనిది పేదల ఆరోగ్య అవసరాలకు వరమని మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళ వారం టీడీపి కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న సుమారు 70 మంది పేదలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రత్యేక చొరవతో మంజూరైన రూ.88,55,357 రూపాయల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిది ద్వార వైద్య ఖర్చులకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. కుటుంభంలో ఒకరు అనారోగ్యంపాలైతే, కుటుంభం మొత్తం కలత చెందుతుందని చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎన్నికల సందర్భంగా ప్రతి కుటుంబానికి పెద్దకొడుకు గా ఉంటానని ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

# నిబంధనలకు నీళ్లు... పట్టించుకోని పంచాయతీ అధికారులు



మొగల్తూరు ఏప్రిల్ 15 జనం రిపోర్టర్ : మొగల్తూరు పంచాయతీ పరిధి పాలకమ్మచెరువు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 220 లో అనధికార లేఔట్ వేస్తున్న స్థానిక పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు .ప్రభుత్వం నిబంధన ప్రకారం పంచాయతీ పరిధిలో




లేఅవుట్ ఏర్పాటు చేస్తే 33 అడుగుల వెడల్పు రోడ్డు,10% సిపి ల్యాండ్%-%విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ లేకుండా నిబంధనలకు తూట్లు పొడుస్తూ అక్రమ వెంచర్లు వేస్తున్న సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఈ అనధికార లేఔట్ ల లో స్థలాలు కొనుగోలు చేసే వినియోగదారులు మౌలిక వసతులు లేకపోవడంతో గృహాలు నిర్మించుకునే సమయంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు .గతంలో ఇదేవిధంగా పంచాయతీ పరిధిలో వెలసిన అనధికార లేఔట్లలో ఇల్లు నిర్మించుకున్నందుకు యజమానులు ముందుకు వచ్చినప్పటికీ వారికి అధికారులు మౌలిక వసతులు కల్పించలేమని చెబుతున్నారు. అక్రమంగా లేఅవుట్ ఏర్పాటుచేసి వాటిని అమ్ముకుని సొమ్ము తీసుకుని వెళ్ళిపోతున్న అక్రమ రియాల్టర్లకు అధికారులు సహకరించడంతో ఆ అనధికార లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేసుకున్న వినియోగదారులు తదుపరి ఇబ్బందులు పాలవుతున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు ఈ అనధికార లేఅవుట్ల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలకు కోరుతున్నారు.

# "భూ భారతి" పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం




జగిత్యాల, ఏప్రిల్ 15 జనం రిపోర్టార్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "భూ భారతి" కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం రోజున రెవెన్యూ డివిజన్ల అధికారులు (ఆర్డిఓ లు) మరియు మండల తహసిల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని భూ రికార్డుల పరిశుద్ధత, భూముల డిజిటలైజేషన్ మరియు రైతులకు న్యాయమైన హక్కుల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో భూ రికార్డుల పున:ర్వ్యవస్తీకరణ, వాటి నమూనాలు, భౌగోళిక సమాచారం నమోదు, రైతుల వద్ద నుండి అభిప్రాయాల సేకరణ వంటి అంశాలపై సమీక్ష జరిపారు. అధికారులు ప్రజలతో సన్నిహితంగా పనిచేసి భూ భారతి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందిని ప్రోత్సహిస్తూ కలెక్టర్, ఈ కార్యక్రమం భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటుందని పేర్కొన్నారు. సర్వే పనులు నిష్పాక్షికంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశం ద్వారా సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయని, భూ భారతి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలన్నారు.



# ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోండి



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిది ( జనం రిపోర్టర్ ) : ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి అమరచింత పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించగలరని మునిసిపల్ కమిషనర్ రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీని ప్రకటించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను ముందస్తుగా చెల్లిస్తే ఈ 5 శాతం రాయితీ వర్తిస్తుందని వారు తెలిపారు.ఈనెల 30 వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లింపుకు అవకాశం ఉందని అన్నారు . ఆస్తి పన్నులు సరైన సమయంలో కట్టకపోతే 2 శాతం అపరాధ రుసుం తో చెల్లించవలసి వస్తుందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

# కుటుంబ సాధికార సారథుల నియామకాలు మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లతో సమావేశం



ఏలేశ్వరం, ( జనం రిపోర్టర్ ) : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా సూచనలతో ప్రత్తిపాడు టిడిపి కార్యాలయంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లతో సమావేశం నిర్వహించిన నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు . ఈ సమావేశంలో కుటుంబ సాధికార సారథులు ( కె.ఎస్. ఎస్ ) ల నియామకం గురించి మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించడం జరిగింది.



## హైదరాబాద్‌లోని శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు ఏం.ఎస్ రాజ్ ఠాకూర్...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 15. హైదరాబాద్‌లోని శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ , ఇతర సహచర మంత్రులతో కలిసి రామగుండం శాసనసభ్యులు ఏం.ఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన మహిళా లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అండ ఎర్రజెండా సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యంనేదునూరి జ్యోతి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : దేశంలో పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక ఉద్యమాలను తీవ్రతరం చేయవలసిన పరిస్థితి ఆసన్నమైనదని నేదునూరి జ్యోతి తెలిపారు మంగళవారం రోజున కాజీపేట మండలం రావి నారాయణరెడ్డి కాలనీలో గుగులోతు రమేష్ అధ్యక్షతన మహాసభ జరగగా సమావేశమునకు ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే చర్యల్ని తీవ్రంగా ఖండించారు వ్యతిరేక చట్టాలు కార్మిక వ్యతిరేక చట్టాలు ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ ముస్లింల పైన రైతుల పైన దళితులపైన దాడులు కొనసాగించడానికి ప్రజాస్వామిక వాదులు తిప్పి కొట్టాలన్నారు 16 లక్షల కోట్ల రూపాయల్ని పెట్టుబడిదారీ వర్గాలకి రుణాలు మాఫీ చేసి మేము పెట్టుబడిదారీ వర్గం తరపున అని చెప్పిన మోడీ ప్రభుత్వాన్ని 99 శాతం గా ఉన్న కార్మిక వర్గం ఒక్క శాతంగా ఉండే అటువంటి పెట్టుబడిదారి వర్గాన్ని కూలదోసి శ్రామిక శ్రేయో రాజ్యం అయినటువంటి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి వర్గ పోరాటాలని తీవ్రతరం చేస్తామని తెలిపారు పేదలు ధనికుల మధ్య తీవ్ర అంతరాలు దీనికి దారితీస్తాయని పేర్కొన్నారు పేద ప్రజల అండ ఎర్రజెండా ప్రతి శ్రామిక జన వాసాలలో ఎగురుతూనే ఉంటుందన్నారు అనంతరం మద్దెల ఎల్లేష్ హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ నగర్లో పేదలు గుడిసెలు వేసుకొని 15 సంవత్సరాలుగా ఎండలో వానలో కష్టాలు ఎదుర్కొంటున్నారని ఈ గుడిసె వాసులకు వెంటనే పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మే నెల 26 27 తేదీలలో హనుమకొండ జిల్లా మహా సిపిఐ మహాసభలు అసంపర్తి మండల కేంద్రంలో జరుగుతాయ అధిక సంఖ్యలో పాల్గొ ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో నేదునూరి రాజ మౌళి బీసీ హక్కుల రాష్ట్ర సాధన సమితి ఉప ప్రధాన కార్యదర్శి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మునిగాల బిక్షపతి సహాయ కార్యదర్శి మాలోతు శంకర్ ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రాసమల్ల దీన దొమ్మటి ప్రవీణ్ రాంపూర్ శాఖ కార్యదర్శి మంద సుమన్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాస మల్ల కుమార్ ఏం కమల భీమనమ్మ పద్మ ఎల్లమ్మ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు సమావేశమునకు ముందుగా ఎర్రజెండాను ఎగురవేయడం జరిగినది మహాసభనూతన నాయకత్వాన్ని ఎన్ను కొనడం జరిగినది రావి నారాయణరెడ్డి కాలనీ కార్యదర్శిగా గుగులోత్ లోతు రమేష్ సహాయ కార్యదర్శిగా చిల్లువేరు రాజేశ్వరి కార్యవర్గ సభ్యులుగా కృష్ణ మనమ్మ భూక్య మమత ఉర్సు వనిత చప్పిడి రజిత వల్లపు రేణుక గార్లని ఎన్నుకోవడం జరిగినది

## వృద్ధునికి చేయూతనిచ్చిన శివకృష్ణచారిబుల్ ట్రస్ట్



నార్పల ( జనం రిపోర్టర్ ) : బొందలవాడ గ్రామంలో లోగన్న అనే వృద్ధుడు నడవడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామస్తులు శివక్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ బొందలవాడ శివకృష్ణచౌదరి గారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆయన ట్రస్ట్ సభ్యుల చేత వెంటనే వాకింగ్ స్టాండను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్య, రవి , రమేష్ పాల్గొన్నారు.

## చలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం లో పాల్గొన్న కోరుకంటి చందర్...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 15.మంగళ వారం బి ఆర్ ఎస్ పార్టీ ఫైవ్ ఇంక్లైన్ పట్టణ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం 12వ. డివిజన్ వినాయక మండపంలో జరిగింది , పట్టణ అధ్యక్షులు బొడ్డు రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసన సభ్యులు కోరకంటి చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంలో బి ఆర్ యస్ రజతోత్సవ సభ ఎల్కతుర్తి లో ఈనెల 27వ. తారీకు రోజున పార్టీ అధ్యక్షులు కెసీఆర్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు మన రామగుండం నుంచి సుమారు 5 వేల పైగా బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్ళే విధంగా ఏర్పాట్లు చేసుకోవడం జరుగుతుందని, దానికి మన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అందరం కలిసికట్టుగా పెద్ద ఎత్తున వెళ్లి ఈ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు 12వ. డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్, 13వ. డివిజన్ మాజీ కార్పొరేటర్ రాకం లతా దామోదర్ 34వ. డివిజన్ మాజీ కార్పొరేటర్ జంజర్ల మౌనిక రాజు, 33వ. డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీష్ కుమార్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి ,మాజీ కౌన్సిలర్ కుడుదుల శ్రీనివాస్ , నాయకులు చీకట్ల లక్ష్మయ్య, లక్ష్మీరాజం, మేకల నవీన్, రాస మల్ల విజేందర్, బుర్రి వెంకటి , బొడ్డు రాజేశం, గాండ్ల సునీల్ ధరణి రాములు పోరండ్ల నారాయణ , దుస్స వెంకటేష్ , ఎర్రోళ్ల రాజు , లంక దాసరి హరికృష్ణ, రామరాజు అనుమల శంకర్ ,గుంషావలి , శ్రీహరి, శ్రీనివాస్ , డిష్ రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం దేవన్నపేటలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సర్వే పుల్ల అశోక్



( జనం రిపోర్టర్ ) : రోజున హసన్ పర్తి మండల పరిధిలోని గ్రామం దేవన్నపేట 65 డివిజన్ లోని సిపిఎం మండల కమిటీ నాయకులు పుల్ల అశోక్ ఆధ్వర్యంలో గ్రామ సర్వే నిర్వహించారు సర్వేలో భాగంగా గ్రామ సమస్యలుగ్రామంలో సర్వే ద్వారా వివిధ సమస్యలు వెలుగులోకి వచ్చాయి ముఖ్యంగా,మురికి కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు.వీధిలైట్లు 24 గంటల పాటు వెలుగుతూ విద్యుత్ వ్యర్థం అవుతోంది.వృద్ధులకు పెన్షన్లు అందడంలేదు. మున్సిపాలిటీ అధికారులు దోమల మందు పిచికారీ చేయకపోవడం వల్ల దోమలు అధికమవుతున్నాయి ప్రతి మహిళకు నెలకు రూ.2500 అందిస్తామని తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ,అది నెరవేరలేదు.ఈ సమస్యలపై దేవన్నపేట గ్రామ ప్రజలుతీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరియు ఉమ్మడి స్మశానవాడిక లేదు ఇందిరమ్మ కాలనీ సైడ్ కాలువ లేదు వీధిసింహాలు,కోతులు ఎస్సీ కమిటీ హాలు సాంక్షన్ అయ్యి 5.సంవత్సరాలు కావస్తుంది కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు స్టార్ట్ చేయడం లేదు అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పట్టించుకోవాలని ఆయన కోరారుఈ సర్వేలో పార్టీ కార్యకర్తలు మండల కమిటీ సభ్యులు నాంపల్లి మౌనిక.మాలోతు లలిత, సందెల రాజు, సందెల చిన్ని,చుంచు రవీందర్, వెంకటయ్య రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు..... డ్రగ్స్ నష్టాల పై విస్తృత ప్రచారం కల్పించాలి...

### మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించిన అదనపు అదనపు కలెక్టర్ డి.వేణు...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 15. పెద్దపల్లి జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ,చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెద్దపల్లి ఏసీపీ జి. క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ రమేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, కె.రాజయ్య సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన డిసిహెచ్ఎస్ .



పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి. వి. రంగారావు మంగళవారం కొల్లూరు పట్టణంలోని నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యశాలలో డాక్టర్స్ ,వైద్య సిబ్బంది యొక్క రిజిస్టర్ ను పరిశీలించి ఇది నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.సామాజిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు డాక్టర్స్ అందుబాటులో ఉండేటట్లుగా , సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రగతి పై సంబంధిత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ కు తగు సూచనలు ఇచ్చారు. వైద్యశాల తో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## కమ్మేటలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు



రంగారెడ్డి జిల్లా జనం ప్రతినిధి ఏప్రిల్ 15 చేవెళ్ల ( జనం రిపోర్టర్ ) : చేవెళ్ల మండలం కమ్మేట గ్రామంలో గౌడ సంఘం నాయకులు గ్రామ పెద్దలు గ్రామస్తులు అందరూ కలిసి గ్రామంలోని ఎల్లమ్మ తల్లికి బోనాల పండుగ చేశారు ఎల్లమ్మకు పోతురాజుల ఊరేగింపులతో గ్రామ ప్రజలకు కోలాహలంగా గ్రామంలో నుండి ఎల్లమ్మ గుడి వరకు ఊరేగింపు గ్రామ ప్రజలందరూ కలిసి ఎల్లమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనంతో నైవేద్యం చేసి ఎల్లమ్మకు సమర్పించినారు ఇట్టి కార్యక్రమం గ్రామ ప్రజలు యువకులు , పెద్దలు ఊరు ప్రజలంతా పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు తర్వాత అన్నదాన కార్యక్రమంలో వచ్చిన భక్తులందరూ అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి దగ్గర తమ కోరుకున్న కోరికలు నెరవేరాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారుకమ్మేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, గ్రామపెద్దలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడమైనదిలి

## దుర్వాసన వెదజల్లుతున్న త్రాగునీరు..



పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో మంగళవారం మున్సిపల్ మంచినీరు దుర్వాసన వెదజల్లుతూ త్రాగటానికి ఇబ్బందికరంగా ఉన్నాయని వార్డు ప్రజలు మీడియాకు తెలిపారు. గత రెండు రోజుల నుండి త్రాగునీరు ఇదే విధంగా వస్తున్నాయని ఆరోపించారు. సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని త్రాగేందుకు ప్రైవేటు వాటర్ ప్లాంట్ దగ్గర నీరు కొనుగోలు చేసే త్రాగవలసి వస్తుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి స్వచ్ఛమైన త్రాగునీరును అందించాలని వార్డు ప్రజలు కోరారు.

## ఎల్లపై ఒరిగిన కరెంటు స్తంభాలు చర్యలు తీసుకోని అధికారులు





మొగల్తూరు ఏప్రిల్ 15 జనం రిపోర్టర్ :మండలంలోని పేరుపాలెం నార్త్ రజకుల పేటలోని గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభాల పిల్ల మీద పడ్డాయి .సుమారు 48 గంటల దాటిన విద్యుత్ పునరుద్ధన కాలేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు అలసత్వం వళ్ళనే పేరుపాలెం నార్త్ రజకులపేట అంధకారంలో రెండు రోజుల నుండి ఉందని అక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నండూరులో పోలేరమ్మ తిరునాళ్ల జాతర..






పొన్నూరు ఏప్రిల్ 15. జనం రిపోర్టర్:పొన్నూరు మండలం నండూరు గ్రామంలో మంగళవారం గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తిరుణాల సందర్భంగా శ్రీ పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది .అనంతరం నండూరు, ఇటికంపాడు గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో తిరుణాల సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు మజ్జిగ,తీర్ధ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తాలూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, పొన్నూరు టౌన్ నాయకులు ఆకుల గోపి, సొంగ సత్యనారాయణ, గ్రామ నాయకులు మాధవరెడ్డి నాగరాజు ఉప్పు గోపి,సంకటి నాగమల్లేశ్వరరావు, తాళ్లూరి నాగరాజు, అక్కిరెడ్డి పవన్, తాళ్లూరి అర్జున్,మరియు జనసైనికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## వివక్ష చూపిస్తున్న ఏలేశ్వరం ఆర్టీసీ డిఎం అంబేద్కర్ 134వ జయంతి సభలో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ పి రావు

ఏలేశ్వరం, (జనం రిపోర్టర్) :ఏలేశ్వరం పట్టణంలోని, స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన, భారత రాజ్యాంగ నిర్మాత, విద్యావంతుడు, అణగారిన వర్గాల వర్గాల ఆశాజ్యోతి అయిన, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 జయంతి వేడుకలు ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు తెలుగులోనూ ఇంగ్లీషులోనూ అంబేద్కర్ పై చేసిన ప్రసంగం వీక్షకులను ఆకట్టుకుంది. ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సంస్కరణల వల్లే సమాజం ఈరోజు ఈ విధంగా రూపుదిద్దుకుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సెక్రటరీ కేటి మూర్తులు, ఇతర నాయకులు అంబేద్కర్ కు ఎదురైన కుల వివక్ష, చదువుకోడానికి డబ్బులు లేక ఆయన పడ్డ ఇబ్బందులు, తర్వాత ఒక దాత సాయంతో ఆయన ఉన్నత చదువులు చదువుకోవడం, తదుపరి తన తెలివితేటలతో, విద్యావేత్తగా ఎదిగిన విధానం, కేంద్ర న్యాయ శాఖామంత్రిగా మసిలన విధానం, తదితర అంశాల గురించి ప్రస్తావించారు. అయితే డిపో మేనేజర్ జీవివి సత్యనారాయణ అంబేద్కర్ పటానికి పూలమాల వేయటానికి సైతం రాకపోవడం డిపోలో విమర్శలకు దారితీసింది. అంతేకాకుండా గ్యారేజ్ లో ఏర్పాటుచేసిన భోజనాలకు సైతం ఆయన హాజరు కాకపోవడం, కార్మికులు అనేక అనుమానాలు వ్యక్తం చేయడానికి. దారి తీసింది. భోజనాలకు హాజరైన కాకినాడ డిపిటిఓ ఏలేశ్వరం ఆర్టిసి డిఎం ను పిలిచి, గట్టిగా వార్నింగ్ ఇచ్చారని ఆర్టీసీ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నేకూరి ప్రకాశరావు, జనం ప్రతినిధితో మాట్లాడుతూ, ఏలేశ్వరం డిపో కి సంబంధించిన ఆర్టీసీ డిఎం సత్యనారాయణకు కుల వివక్ష అత్యధికంగా ఉందని, అందువలననే, దళితుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా జరిగిన జయంతి సభకు రాలేదని, అంతేకాకుండా ఇవి దళితుల భోజనాలు కదా అని చెప్పి, ఆయన అక్కడకు కూడా రాలేదని, ఈ విషయమై డిపిటిఓ, డిపో మేనేజర్ ని ప్రశ్నిస్తే, తనకు కడుపునొప్పిగా ఉందని, అందువలననే తాను భోజనం చేయలేదని అన్నారని, ఎస్సీ, ఎస్టీలు అంటే ఆయనకు ఎంతో చులకన అనీ, అందువలననే డిపోలో పనిచేస్తున్న ఎస్సీ మరియు ఎస్టీలను, వారి తప్పు లేకున్నప్పటికి, వారిని సస్పెండ్ చేయడానికి కానీ, లేదా వేరే రకంగా శిక్షించడానికి కాని ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని నేకూరి ప్రకాష్ రావు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి కే త్రిమూర్తులు, ఆర్టీసీ ఎంప్లాయ్ జీవి రామారావు,ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి యూ.బీ.ఎం కుమార్, ప్రెసిడెంట్ బి.నాని బాబు, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు టీచర్స్, విద్యార్థిని విద్యార్థులు,ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులైన, జి అప్పయ్య, వి.ఎస్. చలం, మిగతా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## హసన్ పర్తి చెరువు కట్ట శుభ్రత కార్యక్రమం బీజేపీ నాయకుల శ్రమదానం



హసన్ పర్తి మండలం మహన్మకొండ జిల్లా హసన్ పర్తి కేంద్ర పరిధిలో భారతీయ జనతా పార్టీ నాయకులు స్వచ్ఛభారత్ అభియాన్ లో భాగంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.హసన్ పర్తి మండల బీజేపీ అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చెరువు కట్ట శుభ్రత కార్యక్రమం, ప్రజలందరిలో స్వచ్చతపై అవగాహన కలిగించేలా ఉండాలని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా చెరువుగట్ట శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. ప్రజాప్రతినిధి స్థాయిలో ఉండీ, భౌతికంగా యాత్రికుడిగా కార్పొరేటర్ చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలిచింది.అనివారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది మానవుని ప్రాధమిక బాధ్యత. ప్రభుత్వంపై ఆధారపడకుండా మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచాలి. చెరువులు మన సంస్కృతి భాగాలు.వాటిని రక్షించడం మన బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మార్పెల్లి రామచంద్రారెడ్డి,మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి,రైల్వే బోర్డు సభ్యులు మేకల హరిశంకర్, దాసరి రాజు, తాళ్ల శ్యామ్, సీనియర్ నాయకులు చేకిలం రాజేశ్వరరావు,దాది మధుసూదన్,గంట సత్యం, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్,మారం కుమారస్వామి,కోసనం సతీష్, వంశీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## విజ్ఞాన్స్ యూనివర్సిటీను సందర్శించిన యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి.



పొన్నూరు ఏప్రిల్ 15 .జనం రిపోర్టర్:చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీను యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ.అగర్వాల్ మహేష్ సందర్శించారు. యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, ఆఫీస్ ఆఫ్ ఐక్యూఏసీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ.అగర్వాల్ మహేష్‌తో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ వర్సిటీ మరియు యునైటెడ్ స్టేట్స్‌లోని గానన్ యూనివర్సిటీ మధ్య మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యా, పరిశోధనా రంగాల్లో సహకారాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో మూడు ముఖ్యమైన కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. అందులో ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, "కోలాబొరేటివ్ హరైజన్స్: జాయింట్ రీసెర్చ్ ఇనిషియేటివ్స్", మరియు ట్విన్నింగ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇరువురు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పరస్పర విజిట్లు చేయడం ద్వారా నూతన బోధనా పద్ధతులు, పరిశోధనా పరిజ్ఞానాన్ని పంచుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో అధ్యయన మరియు పరిశోధన అవకాశాలు అందనున్నాయని వెల్లడించారు. ట్విన్నింగ్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు విజ్ఞాన్ యూనివర్సిటీలో, తదుపరి రెండు సంవత్సరాలు గానన్ యూనివర్సిటీలో చదివి, అంతర్జాతీయ గుర్తింపు కలిగిన డిగ్రీ పొందే అవకాశం కలుగుతోందన్నారు. ఈ ఒప్పందాల ద్వారా విద్యా, పరిశోధన, సాంకేతిక పరస్పర మార్పిడితో పాటు, విద్యార్థులకు గ్లోబల్ ప్రొఫెషనల్ ప్రొఫైల్ అభివృద్ధి చేసే అవకాశాలు విస్తరించనున్నాయని తెలియజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతిలేకుండా నిర్మాణాలు చేపడుతున్న ఎన్టీపీసీ అధికార్లను మందలించిన కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి...




రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 15. రామగుండం కార్పొరేషన్ లో అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టిన ఎన్టీపీసి సంస్థ కు మున్సిపల్ శాఖ భారీ పెనాల్టీ విధించింది. విషయం విదితమే 6 చోట్ల అనుమతిలేకుండా నిర్మాణాలు చేపడుతున్న ఎన్టీపీసి కి 99 కోట్ల 28 లక్షల పెనాల్టీ విధించినట్లు ఏప్రిల్ 2న. అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ విషయం పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు, ఎన్టీపీసి సంస్థ కు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎంపీ వంశీకృష్ణ ఇచ్చిన లేఖ పై స్పందించిన కేంద్ర మంత్రి ఎన్టీపీసి అధికారులను మందలించినట్లు సమాచారం,దీంతో ఇటీవల జిల్లా కలెక్టర్ ను కలిసిన ఎన్టీపీసి అధికారులు నిర్మాణం చేపడుతున్నా భవనాల కోసం అనుమతి తీసుకుంటామని పెనాల్టీ చెల్లించనున్నట్లు తెలిసింది.రామగుండం ప్రాంత అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయించేలా ఎంపీ ఎన్టీపీసి పై ఒత్తిడి తెస్తామన్నారు.అలాగే విద్యుత్ కర్మాగారంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతాం అని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ తెలిపారు.

## ఎల్లకొండ గ్రామస్తుడుని వరించిన దళిత రత్నఅవార్డు...!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్ ఏప్రిల్ 16 (జనం రిపోర్టర్ ) నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన బేగారి గాలయ్యకు దళిత రత్న అవార్డు వారించింది. సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలలో భాగంగా దళితులకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రటించినట్లు బేగారి గాలయ్య మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఈ మెరకు రవీంద్రభారతిలో ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం,ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు,రామచంద్రం చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు.ఈ అవార్డు తన యొక్క భాద్యతను మరింత పెంచిందని చెప్పారు.దళితులందరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు.వెనుకబడ్డ కులాల హక్కులకోసం నిరంతరం కృషిచేస్తానని చెప్పారు.నా సేవలను గుర్తించి దళిత అవార్డుకు ఎంపిక చేసి ప్రధానం చేసిన పెద్దలందరికీ, ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి నా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎల్పీ సమావేశంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సిఎల్పీ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ శంషాబాద్ లోని నోవాటెల్ హాటల్లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ విప్ లు,ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుఈ సిఎల్పీ సమావేశంలో ప్రజాప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తీసుకొని వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు.ఎస్సీ వర్గీకరణ, భూభారతి,సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజలకు అవగాహన కల్పించడంపై సీఎం రేవంత్ రెడ్డి, దిశా నిర్దేశం చేశారుఅనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరియు పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం సలహదారు వేంనరేందర్ రెడ్డి, గృహ నిర్మాణాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యేనాగరాజు పాల్గొన్నారుఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన మహిళా లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష విలువైన చెక్కులను అందజేశారు



# వివక్ష చూపిస్తున్న ఏలేశ్వరం ఆర్టీసీ డిఎం అంబేద్కర్ 134వ జయంతి సభలో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ పి రావు





ఏలేశ్వరం, (జనం రిపోర్టర్) :ఏలేశ్వరం పట్టణంలోని, స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన, భారత రాజ్యాంగ నిర్మాత, విద్యావంతుడు, అణగారిన వర్గాల వర్గాల ఆశాజ్యోతి అయిన, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 జయంతి వేడుకలు ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు తెలుగులోనూ ఇంగ్లీషులోనూ అంబేద్కర్ పై చేసిన ప్రసంగం వీక్షకులను ఆకట్టుకుంది. ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సంస్కరణల వల్లే సమాజం ఈరోజు ఈ విధంగా రూపుదిద్దుకుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సెక్రటరీ కేటి మూర్తులు, ఇతర నాయకులు అంబేద్కర్ కు ఎదురైన కుల వివక్ష, చదువుకోడానికి డబ్బులు లేక ఆయన పడ్డ ఇబ్బందులు, తర్వాత ఒక దాత సాయంతో ఆయన ఉన్నత చదువులు చదువుకోవడం, తదుపరి తన తెలివితేటలతో, విద్యావేత్తగా ఎదిగిన విధానం, కేంద్ర న్యాయ శాఖామంత్రిగా మసిలన విధానం, తదితర అంశాల గురించి ప్రస్తావించారు. అయితే డిపో మేనేజర్ జీవివి సత్యనారాయణ అంబేద్కర్ పటానికి పూలమాల వేయటానికి సైతం రాకపోవడం డిపోలో విమర్శలకు దారితీసింది. అంతేకాకుండా గ్యారేజ్ లో ఏర్పాటుచేసిన భోజనాలకు సైతం ఆయన హాజరు కాకపోవడం, కార్మికులు అనేక అనుమానాలు వ్యక్తం చేయడానికి. దారి తీసింది. భోజనాలకు హాజరైన కాకినాడ డిపిటిఓ ఏలేశ్వరం ఆర్టిసి డిఎం ను పిలిచి, గట్టిగా వార్నింగ్ ఇచ్చారని ఆర్టీసీ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నేకూరి ప్రకాశరావు, జనం ప్రతినిధితో మాట్లాడుతూ, ఏలేశ్వరం డిపో కి సంబంధించిన ఆర్టీసీ డిఎం సత్యనారాయణకు కుల వివక్ష అత్యధికంగా ఉందని, అందువలననే, దళితుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా జరిగిన జయంతి సభకు రాలేదని, అంతేకాకుండా ఇవి దళితుల భోజనాలు కదా అని చెప్పి, ఆయన అక్కడకు కూడా రాలేదని, ఈ విషయమై డిపిటిఓ, డిపో మేనేజర్ ని ప్రశ్నిస్తే, తనకు కడుపునొప్పిగా ఉందని, అందువలననే తాను భోజనం చేయలేదని అన్నారని, ఎస్సీ, ఎస్టీలు అంటే ఆయనకు ఎంతో చులకన అనీ, అందువలననే డిపోలో పనిచేస్తున్న ఎస్సీ మరియు ఎస్టీలను, వారి తప్పు లేకున్నప్పటికి, వారిని సస్పెండ్ చేయడానికి కానీ, లేదా వేరే రకంగా శిక్షించడానికి కాని ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని నేకూరి ప్రకాష్ రావు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి కే త్రిమూర్తులు, ఆర్టీసీ ఎంప్లాయ్ జీవి రామారావు,ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి యూ.బీ.ఎం కుమార్, ప్రెసిడెంట్ బి.నాని బాబు, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు టీచర్స్, విద్యార్థిని విద్యార్థులు,ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులైన, జి అప్పయ్య, వి.ఎస్. చలం, మిగతా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా లో ఇందిరమ్మ ఇండ్ల పథకం లో బాగంగా 300 గృహాలకు మార్కింగ్ చేయగా ,అందులో 25 మంది లబ్ధి దారులు ఈ రోజు వరకు బెష్ మెంట్ నిర్మాణం చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : పరిగి(జనం రిపోర్టర్) :మంగళవారము శంషాబాద్ నోవాటేల్ హెూటల్ నందు రాష్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా ఎంపికైన లబ్ది దారులకు బెష్మేంట్ నిర్మాణానికై ఒక లక్ష రూపాయల చొప్పున ఇద్దరు లబ్ది దారులకు రెండు లక్షల చెక్ లు అంధ జేయడం జరిగిందని తెలిపారు. మిగతా లబ్ది దారులకు అందరికి ఆన్లైన్ ద్వార చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. 1. నూర్జహాన్ బేగం , సంగాయి పల్లి గ్రామం, దుద్యాల మండలం, కోడంగల్ నియోజకవర్గం. 2. మాల లక్ష్మి, ఎంకే పల్లి గ్రామం, పూడూర్ మండలం, పరిగి నియోజకవర్గం.ఈ కార్యక్రమం లో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు రాష్ట్ర ఉన్నతాదికారులు, పి డి హౌసింగ్ ఏ. కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## రాజీవ్ యువ వికాస్ పథకం గడువు ఏప్రిల్ 30వరకు పొడిగించాలి...

## సిఎం డిప్యూటీ సింలను ట్విట్టర్ ద్వారా కోరిన మద్దెల దినేష్...



రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 15. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస్ పథకం ఆన్లైన్ దరఖాస్తుల గడువు సోమవారంతో ఏప్రిల్ 14న. ముగుస్తుండగా మరోసారి పొడిగిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగుతుంది కానీ తీరా దరఖాస్తు చేసుకుందామని సంబంధించిన వెబ్సైట్ ఓపెన్ చేయడంతో దరఖాస్తు గడువు 14వ. తేదీతో ముగిసిందని, వెబ్సైట్ క్లోజ్ చేశామనే సమాచారంతో నిరుద్యోగుల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. అనంతరం ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ఐదు లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, అయితే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడంలోని పలుసమస్యలను గుర్తించిన ప్రభుత్వం తొలుత ఈనెల 14 వరకు గడువు పొడిగించినప్పటికీ చివరి మూడు రోజుల నుండి సర్వర్ ప్రాబ్లంతో అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తూ చేసుకోలేక పోయారని ఆవేదన వ్యక్తం చేసారు. మరోసారి ఈ నెల 24వ. తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో నిరుద్యోగులు సంతోషించారు. కానీ దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవకి వెళ్లి ప్రయత్నించగా సంబంధిత వెబ్సైట్ లో మాత్రం దరఖాస్తు గడువు ముగిసిందని ఉండడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కావున ఏప్రిల్ 30వ. తేది వరకు ప్రభుత్వం పొడగించాలని, ఎలాంటి టెక్నీకల్ సమస్యలు లెకుండా చూడాలని, తాహసిల్దార్ కార్యాలయాలలో సిబ్బంది నిరద్యోగులను ఇబ్బందులు పేట్టకుండా చూడాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ప్రభుత్వాన్ని ఆదేశాలు జారి చేయాలని డిమాండ్ చేశారు.

## మాక్స్ రిటైల్ ప్రవేట్ లిమిటెడ్ హైదరాబాద్ నందు ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని

### జిల్లా ఉపాధి కల్పనా

### అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటన తెలిపారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయము, ఐటిఐ క్యాంపస్ వికారాబాదు నందు ఏప్రిల్ 17 గురువారం ఉదయము 10:30 గంటలకు " జాబ్ మేళా " ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాక్స్ రిటైల్ ప్రవేట్ లిమిటెడ్ హైదరాబాద్ లో సుమారు " 50" (సేల్స్ అసోసియేట్స్) పోస్టులు ఉన్నాయని వీటికి కనీస వయస్సు 18 నుంచి 30 సంవత్సరం లోపు నిరుద్యోగ యువతీ యువకులు అందరూ అర్హులని ఆయన తెలిపారు. ఇట్టి ఉద్యోగానికి పదవ తరగతి అంతకంటే ఎక్కువ (పాస్ లేదా ఫెయిల్), విద్యా అర్హత కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఇట్టి ఉద్యోగాలు హైదరాబాద్ లో ఉన్నాయని ఈ జాబ్ మేళ ద్వారా ఎంపిక అయినా వారికీ నేరుగా ఉద్యోగం కల్పించబడును అని ఆయన అన్నారు ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఇతర వివరములకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర మహాసభ లను విజయవంతం చేయండి ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి పిలుపు



( జనం రిపోర్టర్ ) : తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏ ఐ టి యు సి 4వ మహాసభలు ఏప్రిల్ 21 ,22 నా శంషాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న సందర్భంగా ఏ ఐ టి యు సి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ఈ రోజు చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో లేబర్ అడ్డా దగ్గర మహాసభలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా హైటెక్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి హాజరై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో నిర్మాణరంగం చాలా కీలకమైనది ఈ రంగంలో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు నిర్మాణా రంగంలో పనిచేయు కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ నాయకత్వన నిర్వహించిన పోరాటాల ఫలితంగా 1996లో ఆనాటి యుడిఎఫ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు 2014లో కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేస్తూ దేశంలో వివిధ కార్మిక సంక్షేమ కొరకు ఏర్పాటు చేసిన బోర్డులను కూడా ఒకే గొడుగు కిందకి తీసుకురావాలని దీనివలన నిర్మాణ కార్మికుల కొరకు దేశవ్యాప్తంగా ఉన్న రూ 36 వేల కోట్లను ఇతర కార్మికుల సంక్షేమానికి మళ్ళించేందుకు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగిస్తూ స్వతంత్రంగా పనిచేసే విధంగా చూడాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తుంది అన్నారు ఈ నెల 21వ తారీఖున ఉదయం 10 గంటలకు ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, రామచందర్, మరియు కార్మికులు పాల్గొన్నారు

## ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి యువకుడు మృతి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వేగంగా వెళుతున్న రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున మహబూబ్నగర్ జిల్లా కోట కదిర రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రానికి చెందిన శారదమ్మ సురేందర్ రెడ్డి దంపతులకు కుమారుడు భరత్ కుమార్ రెడ్డి (28) మృతుడు సిద్దిపేటలోని మెరీడియన్ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కాలేజీకి వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున శ్రీరామ్ నగర్ రైల్వే స్టేషన్ కి తండ్రిని తోడుగా తీసుకొని వెళ్ళాడు కుమారుణ్ణి వెంకటాద్రి ఎక్స్ప్రెస్ రైలుకు పంపించి తండ్రి ఇంటికి చేరు. రైలు కోట్ల కాదురా సమీపం కి చేరుకోగానే భరత్ కుమార్ రెడ్డికి రైలు డోర్ తలిగి చింతపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు ఈ మేరకు భరత్ కుమార్ రెడ్డి మృతి సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేశారు. కొడుకు మృతిచెందిన విషయాన్ని తెలుసుకొని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వాకిటి రైలు ప్రమాదంలో మృతి చెందిన భరత కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పరామర్శించారు. భరత్ కుమార్ రెడ్డి మృతి విషయం తెలుసుకుని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాలమూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పోస్టుమార్టం వివరాలను ఆసుపత్రి వర్గాలతో అడిగి తెలుసుకున్నారు. మృతుని తల్లిదండ్రులను కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### రాణా గుప్పిట కీలక రహస్యాలు!

**(విశ్లేషణ)**

పదిహేడేళ్ల క్రితం ముంబై మహానగరంలో 10 మంది ఉగ్రవాదులు 78 గంటలపాటు విచక్షణా రహితంగా దాడులకు తెగబడి 166 మంది ప్రాణాలు బలితీసుకున్న ఘోర ఉదంతంలో కీలక కుట్ర దారైన తహవ్వుర్ రాణా ఎట్టకేలకు మన దేశంలో అడుగుపెట్టాడు. రానున్న 18 రోజుల్లో మన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో అతగాడు ఆ ఘోర ఉదంతానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇస్తాడన్నది చూడాలి. ఆ ఉగ్రవాదులు బాంబులూ, ఇతర మారణాయుధాలతో పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి సముద్ర మార్గంలో ముంబై చేరుకుని ఆ నగరంలో అనేకచోట్ల తుపాకు లతో, గ్రెనేడ్లతో చెలరేగిపోయారు. ఆ దాడుల్లో సాధారణ పౌరులూ, కర్కరే వంటి పోలీస్ ఉన్నతాధికారులూ ప్రాణాలు కోల్పోయారు. తొమ్మిదిమంది ఉగ్రవాదులను భద్రతాదళాలు హత మార్చగా, ఉగ్రవాది కసబ్ పట్టుబడ్డాడు. విచారణానంతరం 2012లో అతన్ని ఉరితీశారు. రాణా వెల్లడించేఅంశాలు మన నిఘా వర్గాల దగ్గరున్న సమాచారంతో ధ్రువీకరించుకోవటానికీ, మరో ఉగ్రవాది, ప్రస్తుతం అమెరికా జైల్లో ఉన్న డేవిడ్ హెడ్లీపై మరిన్ని వివరాలు రాబట్టడానికీ తోడ్పడుతాయి. రాణా అప్పగింత అతి పెద్ద దౌత్యవిజయమని మన ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అటు అమెరికా కూడా ఉగ్రదాడుల్లో హతమైనవారికీ, ఇతర బాధితులకూ న్యాయం చేకూర్చటంలో ఇది కీలకమైన ముందడుగని ప్రకటించింది. కావచ్చు. అయితే కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి జీకే పిళ్లై చెబుతున్నట్టు 'అతగాడి దగ్గర చెప్పడానికేం లేదు గనుకనే...' అప్పగించారా? రాణా పాత్ర కూడా తక్కువేం కాదు. దాడులకు పక్షం రోజుల ముందు భార్యతో కలిసి ముంబైలో చాలా ప్రాంతాలు వెళ్లి చూశాడు. అతను ఎంపిక చేసిన ప్రాంతాలను హెడ్లీ భార్యాసమేతంగా వచ్చి తనిఖీ కూడా చేశాడు. ఇంచుమించు ఆ ప్రాంతాల్లోనే ఉగ్రవాదుల దాడులు జరిగాయి. రాణా ముంబైతోపాటు ఢిల్లీ, కొచ్చి వంటి నగరాలకు కూడా పోయాడు. 1971 నాటి యుద్ధవీరులకై నిర్మించిన ముంబైలోని జల వాయు విహార్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో భార్యతో కలిసి బస చేశాడు. ఆ కాంప్లెక్స్ పేల్చివేతకు అవకాశం ఉందా లేదా చూసుకుని, అసాధ్యమని నిర్ణయించుకున్నాక భారత్ నుంచి వెళ్లిపోయాడని అంటారు. పిళ్లై వాదన పూర్తిగా కొట్టిపారేయదగింది కాదు. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో రాణాతో పోలిస్తే అసలు సిసలు కుట్రదారు డేవిడ్ కోల్మన్ హెడ్లీ. ప్రస్తుతం రాణా అప్పగింత కీలకమైన ముందడుగుగా చెబుతున్న అమెరికా హెడ్లీ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నది? ఎందుకంటే అతగాడు అమెరికా మాదకద్రవ్య నియంత్రణ విభాగం (డీఈఏ) ఏజెంట్‌గా పని చేశాడు. అదే సమయంలో ఐఎస్ఐకీ, లష్కరే తొయిబా (ఎల్ఈటీ)కీ కూడా ఏజెంట్‌గా ఉన్నాడు. ఇవన్నీ అమెరికా నిఘా సంస్థలకూ తెలుసు. అంతేకాదు... ముంబై మారణకాండ పథక రచన మొదలుకొని అన్ని విషయాలపైనా అమెరికా దగ్గర ముందస్తు సమాచారం వుంది. ఆ సంగతలా వుంచి భారత్‌లో సేకరించిన సమస్త సమాచారాన్నీ, ముంబైకి సంబంధించిన జీపీఎస్ లోకేషన్‌లనూ హెడ్లీకి రాణా అందించాడు. దాని ఆధారంగానే కొలాబా తీరప్రాంతంలోని బధ్వర్ పార్క్ దగ్గర ఉగ్రవాదులు బోట్లు దిగారు. రాణా ఇచ్చిన సమాచారాన్ని హెడ్లీ పాకిస్తాన్ పోయి అక్కడ ఐఎస్ఐ తరపున తనతో సంప్రదిస్తున్న మేజర్ ఇక్బాల్ అనే వ్యక్తికి అందజేశాడని ఇప్పటికే మన నిఘా సంస్థలకు రూఢి అయింది. ఉగ్రవాదులకు ఐఎస్ఐ ఇచ్చిన శిక్షణేమిటో హెడ్లీకి తెలుసు. వీటిపై అమెరికా భద్రతా సంస్థలకు క్షుణ్ణంగా తెలిసినా మన దేశాన్ని ముందే ఎందుకు అప్రమత్తం చేయలేదన్న సంశయాలున్నాయి. ఇది బయటపడుతుందన్న ఉద్దేశంతోనే అమెరికా ఏవో సాకులు చెబుతోందన్నది వాస్తవం. సందేహం లేదు... రాణా కన్నా హెడ్లీ అత్యంత కీలకమైనవాడు. అతను ఎల్ఈటీలో చేరడమే కాక, ముంబై దాడులకు పన్నాగం పన్నిన ఉగ్రవాదులు హాఫీజ్ సయీద్, లఖ్వీల దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ముంబై దాడుల సమయంలో దగ్గరుండి చూస్తున్నట్టుగా ఉగ్రవాదులకు ఎప్పటి కప్పుడు ఫోన్‌లో లఖ్వీ ఆదేశాలివ్వటం వెనక హెడ్లీ ప్రమేయం వుంది. తమకు ఏజెంటుగా పని చేసినవాడిని అప్పగించరాదని అమెరికా భావించటం మూర?త్వం. అదే పని భారత్ చేస్తే అంగీకరించగలదా? హెడ్లీని అప్పగిస్తే తమ గూఢచార సంస్థల నిర్వాకం బయటపడుతుందని అది సంకోచిస్తున్నట్టు కనబడుతోంది. రాణా అప్పగింత ప్రక్రియ తమ హయాంలోనే మొదలైందని గర్వంగా చెబుతున్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరం హెడ్లీ విషయంలో ఎందుకు విఫలమయ్యారో చెప్పాలి. వికీలీక్స్ పత్రాలు ఈ సంగతిని చాన్నాళ్ల క్రితమే వెల్లడించాయి. హెడ్లీ అప్పగింతకు పట్టుబట్టవద్దని అప్పటి మన జాతీయ భద్రతాసలహాదారు ఎంకే నారాయణన్‌ను నాటి అమెరికా రాయబారి తిమోతీ రోమెర్ కోరినట్టు అందులో ఉంది. అలా అడిగినట్టు కనబడకపోతే తమకు ఇబ్బందులొస్తాయని నారాయణన్ బదులిచ్చినట్టు కూడా ఆ పత్రాల్లో ఉంది. హెడ్లీ ఎలాంటివాడో అతని కేసులో 2009లో తీర్పునిచ్చిన అమెరికా న్యాయమూర్తే చెప్పారు. 'హెడ్లీ ఉగ్రవాది. అతని నుంచి ప్రజలను రక్షించటం నా విధి. మరణశిక్షకు అన్నివిధాలా అర్హుడు. కానీ ప్రభుత్వ వినతి మేరకు 35 ఏళ్ల శిక్షతో సరిపెడుతున్నాను' అన్నారాయన. ఎటూ పాకిస్తాన్ తన రక్షణలో సేద తీరుతున్న లఖ్వీ, సయీద్‌లను అప్పగించదు. ఆ దేశంతో మనకు నేరస్థుల అప్పగింత ఒప్పందం కూడా లేదు. కానీ అమెరికాతో ఆ మాదిరి ఒప్పందం ఉంది గనుక హెడ్లీ కోసం మన దేశం గట్టిగా పట్టుబట్టాలి. అది సాధిస్తేనే నిజమైన విజయం దక్కినట్టవుతుంది.

# మేడారం మాస్టర్ ప్లాన్ ఎక్కడా..!



: మేడారం మాస్టర్ ప్లాన్ అటెకెక్కిందా..? గద్దెల ప్రాంగణం విస్తరణ వచ్చే మహాజాతర నాటికి అసాధ్యమేనా..? వచ్చే జాతరలోనూ లక్షలాది మంది భక్తులకు అమ్మవార్ల దర్శనం కష్టతరమేనా..? అంటే పరిణామాలు చూస్తుంటే అలాగే కనిపిస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ -గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది మేడారం. ఆలయ అభివృద్ధికి రూ.300 కోట్లతో పనులు చేపడుతామని రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖలు మినీ మేడారం రివ్యూ సమయంలో వెల్లడించినా జాతర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహాజాతర నాటికి పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఎందుకంటే మాస్టర్ ప్లాన్ పనులకు ఇంకా రూపకల్పనే జరగకపోవడం ఇందుకు నిదర్శనం. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత పనుల్లో అత్యంత ముఖ్యమైన ప్రాంగణాల విస్తరణకు ఎలాంటి ముందడుగు పడకపోవడం గమనార్హం. మేడారం మాస్టర్ ప్లాన్ అమలుకు, జాతర అభివృద్ధి పనులకు 19.5 ఎకరాల భూ సేకరణ చేపట్టాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ అభిప్రాయానికి వచ్చిన ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలేవీ జరగకపోవడం వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.

మహాజాతరలో కష్టాలు తప్పవా..?!

సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు మహాజాతర సమయంలో కోటిమందికి పైగా భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. వనదేవతలు గద్దెల పై ఉన్న ఆ మూడు రోజుల్లో లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకుంటారు. మేడారమంతా భక్తజన సంద్రమవుతోంది. గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోతూ ఉంటుంది. వందల కిలోమీటర్ల నుంచి గంటల కొద్దీ క్యూలైన్లలో నిల్చుని అమ్మల దర్శనం కోసం వస్తున్న భక్తులు.. సగం మంది దూరం నుంచే వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రవేశ, బయటకు వెళ్లే మార్గాలు కూడా ఇరుకుగా ఉండటం, ప్రాంగణంలోని క్యూలైన్లను విస్తరించే మార్గం లేకపోవడం వంటి కారణాలతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గద్దెల ప్రాంగణాన్ని విస్తరించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో భక్తులు ఎంతో సంతోషించారు. అయితే ప్రభుత్వం ఆలోచనయితే చేసింది గాని.. ఆచరణలో పనులు ముందుకు జరగకపోవడంపై భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

టీటీడీ తరహాలో

వనదేవతలను దర్శించుకునేందుకు ఇప్పుడు నిత్యం వేలాది మంది భక్తులు మేడారం చేరుకుంటున్నారు. మహాజాతరలో కోటికి పైగా, మినీ జాతర సమయంలోనే లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. అయితే మేడారం మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం, సోమ, బుధవారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. నిత్యం రద్దీగానే కనిపిస్తున్నాయి. మహా, మినీ జాతర సమయాల్లోనే యంత్రాంగం సౌకర్యాల పై దృష్టిపెడుతున్నా.. మిగిలిన సమయాల్లో పట్టింపు కరువవుతోంది. భక్తుల అసౌకర్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ద్వారా శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2026 మహాజాతర నాటికి మేడారంలో సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ప్రభుత్వం వెల్లడించినా ఆ దిశగా పనులు ప్రారంభమే కాకపోవడం గమనార్హం. వాస్తవానికి 2023లోనే వనదేవతల మూలధన నిధి నుంచి 2.72 కోట్లను మాస్టర్ రూపకల్పనకు ములుగు కలెక్టర్ ఖాతాలో నిధులు జమ చేశారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జాతర అభివృద్ధికి కోసం 300 కోట్లతో పనులకు ప్రాథమిక రూపకల్పన చేసింది. అయితే ఇందులో పూర్తి స్పష్టత లేదు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రధానంగా గద్దెల ప్రాంగణాలను విశాలంగా మార్చటం, టీటీడీ తరహాలో భక్తులు ప్రశాంత వాతావరణంలో గద్దెల ప్రాంగణానికి చేరుకునేలా క్యూలైన్ కాంప్లెక్సుల నిర్మాణం, కాంప్లెక్సుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి తీసుకునే విధంగా కూర్చునేవిధంగా గద్దెల నిర్మాణం ఉండేలా చేపట్టాలని నిర్ణయించారు. మేడారంను అనుసంధానం చేస్తున్న పస్రా - మేడారం, తాడ్వాయి-మేడారం, కొండాయి, భూపాలపల్లిని కలిపే కాల్వపల్లి, గొల్లబుద్దారం, బయ్యక్కపేట రోడ్లను విస్తరణ చేపట్టడం, మేడారం జాతర ప్రాంగణానికి చేరువలో పార్కింగ్ స్థలాలను, 20 కిలోమీటర్ల నుంచి పార్కింగ్ హోల్డింగ్ పాయింట్లను గుర్తించి నిర్మాణాలు చేపట్టడం, మేడారంలో అంతర్గత రోడ్ల అభివృద్ధి, విస్తరణ వంటి అనేక అంశాలు మాస్టర్ ప్లాన్‌లో చేర్చి అభివృద్ధి చేయాలన్న ఆలోచనలు.. ఆలోచనలుగానే ఉండిపోతున్నాయి. మరోవైపు గద్దెల ప్రాంగణంలో 500 మీటర్లు ప్రైవేటు నిర్మాణాలు చేపట్టవద్దని 2012లో గత అధికారులు తెలియజేసినా ఆలయ పరిసరాల్లో ప్రైవేటు వ్యక్తులు కొత్త నిర్మాణాలు జరిగిపోతుండటం అభివృద్ధి పనుల కొనసాగింపునపై ప్రశ్నలు లేవనెత్తేలా చేస్తున్నాయి.

# అణు విద్యుచ్ఛక్తిలో... చైనా అద్భుతం!

**ప్రపంచంలోనే తొలిసారి కేంద్రక సంలీన, విచ్ఛిత్తి అణు రియాక్టర్**

**విజయవంతమైతే నిరంతర, అపార విద్యుచ్ఛక్తి అందుబాటులోకి**

**ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి.**



కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ వంటి రంగాల్లో ముందంజలో ఉండాలంటే అత్యధిక విద్యుత్, అది కూడా కారుచౌకగా అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం.ఎందుకంటే ఒక అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్వహించాలంటే కనీసం 40 లక్షల విద్యుత్ వాహనాలను చార్జ్ చేయడానికి సమానమైన విద్యుత్ కావాలని అంచనా. ఆన్‌లైన్ డేటాను రెప్పపాటులో ప్రాసెస్ చేసే కృత్రిమ మేధ డేటా సెంటర్లకు ప్రాణమైన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ)లకు కూడా నిరంతరం నిరాటంకమైన విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రపంచమే డేటామయంగా మారిన నేపథ్యంలో డేటాను కాపాడుకోవాలన్నా, ఆన్‌లైన్‌లో నిరంతరం అందుబాటులో ఉంచాలన్నా అపారమైన విద్యుచ్ఛక్తి కావాల్సిందే. అణు విద్యుత్ రంగంలో ఇప్పటికే నంబర్‌వన్‌గా ఉన్న చైనా దీన్ని ముందే పసిగట్టింది. ప్రపంచంలోనే తొలిసారిగా 'కేంద్రక సంలీన, విచ్ఛిత్తి' సూత్రాల కలబోతగా ఓ వినూత్న అణు రియాక్టర్ తయారీకి నడుం బిగించింది. ఈ ప్రయత్నం గనుక ఫలిస్తే అపారమైన విద్యుత్ నిరంతరంగా అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

అన్నింట్లోనూ అగ్రస్థానం కేసి...

ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త రకం వస్తువు తయారైనా వెంటనే దానికి నకలు తయారు చేస్తుందని చైనాకు పేరుంది. ఇమిటేషన్ టెక్నాలజీకి పేరెన్నికగన్న చైనా ఇప్పుడు వినూత్న ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆశపడుతోంది. పరిశోధన, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా వాటికి అత్యధిక నిధులు కేటాయించిన దేశాల్లో చైనాది రెండో స్థానం విశేషం.హువాయీ, టెన్‌సెంట్, అలీబాబా, గ్జియోమీ, డీజేఐ కంపెనీలు, ఇన్నోవేషన్‌కు సంబంధించి బీవైడీ తదితరాలు చైనాను టెక్నాలజీలో అగ్రస్థానంలో నిలిపాయి. 5జీ టెక్నాలజీలో హువాయీ, డ్రోన్ టెక్నాలజీలో బీవైడీ టాప్ కంపెనీలుగా వెలుగొందుతున్నాయి. ఐదు నిమిషాలు ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్ల వెళ్లగల బ్యాటరీ, చార్జింగ్ వ్యవస్థలను బీవైడీ అభివృద్ధి చేసింది. విద్యుత్ వాహనాల అమ్మకాలు, ఆదాయంలో అది 'టెస్లా'ను దాటేసిందని బీబీసీ ఇటీవలే పేర్కొంది. విద్యుత్ ఆధారిత రంగాల్లో అగ్రగామిగా కొనసాగాలంటే నిరంతర విద్యుత్ అవసరం. ఆ అవసరాలు తీరేలా చైనా ఇలా కేంద్రక సంలీన, విచ్ఛిత్తి రియాక్టర్ పనిలో పడింది.

ఇలా పని చేస్తుంది

జియాన్గ్జి ప్రావిన్సులోని యహెూహూ సైన్స్ ద్వీపంలో ఝింగ్‌హువో పేరిట ఈ వినూత్న అణు విద్యుత్కేంద్రాన్ని కేంద్రాన్ని చైనా నిర్మిస్తోంది. చైనా భాషలో ఝింగ్‌హువో అంటే మెరుపు. కేంద్రక విచ్ఛిత్తిలో యురేనియం వంటి బరువైన అణువులోని కేంద్రకం రెండు చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో అత్యధిక స్థాయిలో ఉష్ణశక్తి వెలువడుతుంది. అణుబాంబు తయారీలో ఉండేది ఈ సూత్రమే.అణు రియాక్టర్లలో నూ దీన్నే వాడతారు. అదే కేంద్రక సంలీన ప్రక్రియలో రెండు కేంద్రకాలు కలిసిపోయి ఒక్కటిగా మారతాయి. విచ్ఛిత్తితో పోలిస్తే సంలీన చర్యతోనే అత్యధిక విద్యుదుత్పత్తి సాధ్యం. ఝింగ్‌హువో రియాక్టర్‌లో తొలుత సంలీన చర్యలు జరిపి వాటి ద్వారా వచ్చే భారయుత కేంద్రకాల సాయంతో విచ్ఛిత్తి జరుపుతారు. తద్వారా మరింత ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐదేళ్లలో లక్ష్యాన్ని సాధించాలని భావిస్తున్నారు.

అత్యధిక 'క్యూ వాల్యూ'

అత్యధిక అణు విద్యుదుత్పత్తి జరగాలంటే కేంద్రక సంలీన చర్యలో అత్యధిక శక్తి ఉద్గారం జరగాలి. సంలీన ప్రక్రియలో విడుదలయ్యే అత్యధిక ఉష్ణశక్తిని రియాక్టర్ విద్యుత్ రూపంలోకి మారుస్తుంది. సంలీన ప్రక్రియకు వెచ్చించాల్సిన శక్తి కంటే దాన్నుంచి ఉత్పన్నమయ్యే శక్తి ఎక్కువగా ఉండటాన్ని 'నికర శక్తి లాభం'గా పిలుస్తారు. దాన్నే 'క్యూ వాల్యూ'గా చెప్తారు. సంలీన ప్రక్రియలో అత్యధికంగా ఏకంగా 30 క్యూ వాల్యూను సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం పేర్కొంది. మూడేళ్ల క్రితం అమెరికాలో కాలిఫోర్నియాలోని నేషనల్ ఇగ్నిషన్ ఫెసిలిటీ కేంద్రం 1.5 క్యూ వాల్యూను సాధించింది. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పరిమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) 10 క్యూ వాల్యూను సాధించే ప్రయత్నంలో ఉంది. అమెరికా, ఫ్రాన్స్ ఇప్పటికే కేంద్రక సంలీనం ద్వారా అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు శ్రమిస్తున్నాయి. చైనా తాజా యత్నాలు ఫలిస్తే అది ఏకంగా 20 ఏళ్లు ముందుకు దూసుకెళ్లగలదని ఆంట్రప్రెన్యూర్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఆర్నాడ్ బేర్‌ట్రెండ్ అభిప్రాయపడ్డారు.

# పట్టణాల్లో అధిక ఖర్చు వీటికే..



నెలవారీ సంపాదనను నిత్యావసర ఖర్చులు, విలాసాలు, ఆన్‌లైన్ షాపింగ్.. వంటి వాటికి వెచ్చిస్తుంటారు. అయితే గ్రామీణ వినియోగదారుల ఖర్చులు పట్టణ వినియోగదారులతో పోలిస్తే కాస్తా భిన్నంగా ఉండవచ్చు.ఎందుకంటే అక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరుగా ఉంటాయి. కానీ పట్టణాల్లో వినియోగదారుల ఖర్చులు ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఆర్థిక స్తోమత మెరుగ్గా ఉన్న కొందరు మరింత లగ్జరీ వస్తువులు, హోటళ్లు, రెస్టారెంట్లకు ఖర్చు చేస్తారు. సాధారణంగా పట్టణ వినియోగదారులు ఎలాంటి వాటికి అధికంగా ఖర్చు చేస్తున్నారో నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఫుడ్ అండ్ బేవరేజెస్

నెలవారీ బడ్జెట్‌లో గణనీయమైన భాగం అంటే సుమారు 20-30% ఆహార పదార్థాలకు కేటాయిస్తున్నారు. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసరాలు ఇందులో ఉన్నాయి. బ్రాండెడ్, ప్యాకేజ్డ్ ఆహారాలు, తినడానికి సిద్ధంగా ఉన్న భోజనం, ప్రాసెస్ చేసిన స్నాక్స్‌కు కూడా ప్రాధాన్యత పెరుగుతోంది.

హౌసింగ్, యుటిలిటీస్

అద్దె లేదా ఇంటి కోసం ఈఎంఐలకు అధికంగా చెల్లింపులు చేస్తున్నారు. గృహ ఖర్చులు బడ్జెట్‌లో 25-35% వరకు ఉంటున్నాయి. సొంతంగా ఇళ్లు ఉన్న పట్టణ వినియోగదారులు తరచుగా తమ ఇంటి సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రిన్యువేషన్, అలంకరణలు, స్మార్ట్ హోమ్ గాడ్జెట్ల కోసం వెచ్చిస్తున్నారు.

హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషన్

గత దశాబ్ద కాలంలో హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ వంటి సేవలపై ఖర్చు గణనీయంగా పెరిగింది. ఈ విభాగాల్లో వరుసగా 8.2 శాతం, 7.5 శాతం వృద్ధిరేటు నమోదైంది. దాంతో వీటికి చేసే ఖర్చు భారీ మొత్తంలో ఉంటుంది. ఆరోగ్య బీమా తీసుకోని వారి పరిస్థితులు దారుణంగా ఉంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ప్రతిఒక్కరు తమ కనీస బాధ్యతగా తప్పకుండా ఆరోగ్యబీమా తీసుకోవాలని సూచిస్తున్నారు. విద్యార్థుల ఫీజుల విషయంలో ప్రభుత్వాలు స్పందించి విచ్చలవిడిగా యాజమాన్యాలు వాటిని పెంచకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

రవాణాజి


ప్రజా రవాణా, వ్యక్తిగత వాహనాలు, ఇంధనం, నిర్వహణ.. వంటి ఖర్చులు బడ్జెట్లో 10-15% ఉంటున్నాయి. ఇది వినియోగదారుల వ్యయ సరళితోపాటు ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధిని సూచిస్తుంది. చాలా మంది రవాణా కోసం కార్లు, ద్విచక్ర వాహనాలను ఎంచుకుంటున్నారు.

వినోదం

సినిమాలు, కచేరీలు, థీమ్ పార్కులు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో ఖర్చు చేస్తున్నారు. ఇది సాధారణంగా బడ్జెట్లో 5-10% వాటాను కలిగి ఉంటుంది. కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ గేమింగ్‌ల కోసం పట్టణ వినియోగదారులు అధికంగా ఖర్చు చేశారని కొన్ని సర్వేలు చెబుతున్నాయి.పొదుపు విషయంలో చాలా మందికి సాధారణంగా ఖర్చు తర్వాత మిగిలింది జాగ్రత్తగా పొదుపు చేద్దామనే ఆలోచన ఉంటుంది. కానీ ముందు పొదుపు తర్వాతే ఖర్చు అనే ధోరణి అలవరుచుకుంటే తప్పకుండా దీర్ఘకాలంలో మంచి రాబడిని సొంతం చేసుకోవచ్చు. కాబట్టి ఖర్చులు ఎలాగో ఉంటాయి. తర్కంతో ఆలోచించి తక్కువ ఖర్చు చేస్తూ పొదుపునకు పెద్దపీట వేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సినిమా చిత్రం

## హిట్ 3 ట్రైలర్..
## నరకాన్ని తలపిస్తోన్న అర్జున్ సర్కార్ ఊచకోత



న్యాచురల్ స్టార్ నాని నుంచి మరోసారి ఓ డిఫరెంట్ గెటప్‌లో మాస్ ట్రాన్స్ఫర్మేషన్‌ను చూపించే ట్రైలర్ వచ్చేసింది. మే 1న విడుదల కానున్న హిట్ 3: ది థర్డ్ కేస్ నుంచి ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఆ ట్రైలర్ చూస్తే నాని తన క్యారెక్టర్ లో ఎలాంటి మాస్ ఫెవర్ తీసుకురాబోతున్నాడో స్పష్టమవుతుంది. ఈసారి నాని పాత్ర పేరు అర్జున్ సర్కార్. ఓ బ్రూటల్ పోలీస్ అధికారిగా కనిపిస్తున్న నాని పాత్రలో ఎన్నో లేయర్స్ ఉన్నాయి. / ట్రైలర్ మొత్తం డార్క్ టోన్, విభిన్న లైటింగ్ స్కీమ్స్‌తో కనిపించడం సినిమాకు ఉన్న కొత్త వాతావరణాన్ని తెలిపేలా ఉంది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టెక్నికల్‌గా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ట్రైలర్‌లో నాని ఊచకోత సీన్లు నిజంగా గుగుర్పొట్టేలా ఉన్నాయి. జనంలో ఉంటే అర్జున్.. క్రిమినల్స్ మధ్యలో ఉంటే సర్కార్.. అని క్యారేక్టర్ ను బలంగా హైలెట్ చేశారు. క్రిమినల్స్ ను అసలు ఏమాత్రం వదిలి పెట్టకూడదనే తత్వంతో ఉండే అర్జున్ సర్కార్ లో ఓ లవ్ ఏమోషన్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అతని క్యారెక్టర్ ను చాగంటి ప్రవచనంతో హైలెట్ చేయడం మరో విశేషం. ముఖ్యంగా ఓ డ్రింక్ సీన్ తర్వాత ఆయన మెల్లిగా రగిలిపోతూ అరుస్తూ చెప్పే డైలాగ్ "అబ్కి బార్ అర్జున్ సర్కార్" మాస్ బ్లాక్ బస్టర్ వేటకు సంకేతమవుతుంది. ఈసారి నాని తన కంఫర్ట్ జోన్‌ను దాటి వెళ్లి మరింత హెూరాహెూరీగా, ఊహించని యాంగిల్‌లో కనిపిస్తున్నాడు. ట్రైలర్‌ను చూస్తే, కథలో ఏదో జరుగుతుందనే ఆసక్తి కలుగుతుంది. కథ అంతా చెప్పకుండా, కేవలం క్యారెక్టర్ హైలైట్స్, విజువల్స్, మూడ్‌ను చూపించి ప్రేక్షకుడిని ఆకర్షించే విధంగా కట్ చేశారు. నాని కనిపించిన ప్రతీ ఫ్రేమ్‌లో డిఫరెంట్ ఎనర్జీ కనిపిస్తుంది. ముఖ్యంగా చంపే విధానం నరకాన్ని తలపించేలా ఉందనే కామెంట్స్ వస్తున్నాయి.




బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో మిక్కీ జే మేయర్ మరోసారి తన మార్క్ చూపించారు. ట్రైలర్‌కు అతని సంగీతం అదనపు బలంగా మారింది. అలాగే ప్రొడక్షన్ డిజైన్, స్టైలిష్ ఫ్రేమ్స్ సినిమాను విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలుస్తున్నాయి. నిర్మాత ప్రశాంతి త్రిపినేని సినిమా కంటెంట్‌కి ఏ మాత్రం కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో నిర్మించడం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తానికి 'హిట్ 3' ట్రైలర్ చూసిన తరువాత అందరిలోనూ ఒకే మాట వినిపిస్తుంది "ఈసారి నాని ఊచకోత గట్టిగానే ఉండబోతోంది.. బ్రూటల్ అర్జున్ సర్కార్" అని కామెంట్ చేస్తున్నారు. మే 1వ తేదీన ఈ సినిమా థియేటర్లలోకి వస్తోంది. ఇప్పటివరకు మెల్లిగా వెళ్లిన హిట్ ఫ్రాంచైజీకి ఈసారి నాని రూపంలో బిగ్ బాంగ్ అనిపించేలా ఉంది.

## సౌత్ బజ్ నెక్స్ట్ లెవెల్..!

బ్రహ్మాస్త్ర డైరెక్టర్ అయాన్ ముఖర్జీ ఆ సినిమా సీక్వెల్ ని పక్కన పెట్టి వార్ 2 సినిమా చేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తో పాటుగా మన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా ఈ సినిమాలో భాగం అవ్వడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ముఖ్యంగా ఎన్ టీ ఆర్ కి ఉన్న మాస్ ఫాలోయింగ్ వల్ల వార్ 2కి బాలీవుడ్ లో కన్నా సౌత్ లో ఎక్కువ క్రేజ్ పెరిగింది. అందులో భాగంగానే హృతిక్ రోషన్ ఎక్కడ ఈవెంట్ కి వెళ్లినా తారక్ గురించి అతని నటన గురించి ప్రత్యేకంగా చెబుతున్నాడు. సో వార్ 2 సౌత్ ఆడియన్స్ కు మాత్రమే కాదు నార్త్ ఆడియన్స్ కి కూడా ఎన్టీఆర్ అంటే ఏంటో చూపించేలా చేస్తాడని తెలుస్తుంది.

సాధారణంగా హిందీ సినిమాలకు సౌత్ లో అంత గొప్ప క్రేజ్ ఉండదు. జస్ట్ సినిమా రిలీజ్ టైం లో ఇంటర్వ్యూస్ తప్ప మిగతా హడావిడి ఏది ఉండదు. కానీ వార్ 2 ప్లానింగ్ వేరేలా ఉంది. సినిమాను సౌత్ లో కూడా భారీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఎన్టీఆర్ ఉన్నాడు కాబట్టి తెలుగులో వార్ 2 స్ట్రైట్ సినిమాలానే రిలీజ్ చేసేలా చూస్తున్నారు. అదే జరిగితే వార్ 2 బజ్ నెక్స్ట్ లెవెల్ ఉంటుందని చెప్పొచ్చు. ఐతే ఈ సినిమాలో ఎన్టీఆర్ ది నెగిటివ్ రోల్ అన్న టాక్ వినిపిస్తుంది. తారక్ రోల్ ని పర్ఫెక్ట్ గా చూపించగలిగితే మాత్రం నార్త్ సైడ్ ఏమో కానీ సౌత్ లో ముఖ్యంగా తెలుగులో సినిమా రిజల్ట్ వేరే లెవెల్ లో ఉంటుంది. అందుకే మేకర్స్ కూడా వార్ 2 మీద ఎక్కువ హైప్ తీసుకు రావట్లేదని తెలుస్తుంది.టీ సీరీస్ నిర్మిస్తున్న వార్ 2 సినిమాను ఆగష్టు 14న రిలీజ్ లాక్ చేశారు. ఈ సినిమాలో కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తుంది. వార్ 2 ప్రమోషన్స్ ని నార్త్ సైడ్ కి ఈక్వల్ గా సౌత్ ప్రమోషన్స్ కి రెడీ అవుతున్నారు. ఎన్టీఆర్ ఉన్నాడు కాబట్టి తెలుగులో వార్ 2 కి మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరి వార్ 2 మేకర్స్ ప్లాన్ ఏంటన్నది చూడాలి. ఆర్.ఆర్.ఆర్ లో భీమ్ పాత్రలో ఎన్టీఆర్ నార్త్ ఆడియన్స్ ని అలరించాడు. వార్ 2 తో స్ట్రైట్ సినిమాతో అక్కడ మెప్పు పొందాలని చూస్తున్నాడు. మరి ఈ మెగా మాస్ యాక్షన్ మూవీ ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.



## అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా.. బ్రాండ్స్ పై సామ్!





స్టార్ హీరోయిన్ సమంత.. కొంతకాలంగా తన రూట్ ఛేంజ్ చేసేశారని చెప్పాలి. సెల్ఫ్ లవ్, హెల్త్, వర్కౌట్స్, పీస్ ఫుల్ నెస్ కు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు మోటివేషన్ తో పాటు మహిళా సాధికారత వంటి అంశాలపై పోస్టులు పెడుతున్నారు. / సినిమాలు, వెబ్ సిరీసుల విషయానికొస్తే.. తనకు అన్ని విధాలుగా ఓకే అయితేనే మూవీస్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ యాక్ట్ చేస్తున్నారు. రీసెంట్ గా సిటడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్నారు. విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా దక్కించుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీ బిజీగా గడుపుతున్నారు.అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో కీలక విషయాలపై మాట్లాడారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా బ్రాండ్ ఎండార్స్మెంట్స్ పై సామ్ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. రూ. కోట్లలో డబ్బులు వస్తున్నా.. తాను ఇటీవల ఎన్నో బ్రాండ్స్ ఎండార్స్మెంట్స్ ను వదులుకున్నానని తెలిపారు. 20 ఏళ్ల వయసులో తాను ఇండస్ట్రీలోకి వచ్చానని, అప్పట్లో సక్సెస్ అంటే మీనింగ్ వేరే అని సమంత చెప్పారు. ఎన్ని సినిమాల్లో నటించాం, ఎన్ని బ్రాండ్స్ ను ప్రమోట్ చేశాం.. ఆ కౌంట్ పైనే సక్సెస్ ను డిసైడ్ చేసేవారని అన్నారు. అప్పుడు తాను మల్టీనేషనల్ బ్రాండ్స్ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించారని గుర్తుచేసుకున్నారు సామ్. "అప్పుడు ఎంతో హ్యాపీగా ఫీలయ్యా. కానీ ఇప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకున్నా. బ్రాండ్స్ ఎండార్స్మెంట్స్ చేసినప్పుడు ఎంతో బాధ్యతగా ఉండాలని తెలుసుకున్నా. అందుకే ఇప్పుడు సారీ చెబుతున్నా. ఏడాదిలో కొన్ని కోట్ల రూపాయలు ఇస్తామని చాలా ఆఫర్స్ వచ్చాయి. కానీ నేను 15 బ్రాండ్స్ వదులుకున్నా" అని చెప్పారు సామ్. "అయితే నా వద్దకు ఆఫర్స్ ఎన్నో వస్తూనే ఉంటాయి. కానీ వాటిని నేను వెంటనే యాక్సెప్ట్ చేయను. ముందుగా ఆ ఉత్పత్తుల కోసం ఆరా తీ స్తాను. తెలిసిన ముగ్గురు వైద్యులను సం ప్రది స్తాను. వాటి పరిస్థితి తెలుసుకుంటాను. సమా జానికి హాని చేయవని డిసైడ్ అ య్యాకే ముందుకు వెళ్తాను. అలానే ఇప్పుడు కొన్ని బ్రాండ్స్ ను ప్ర మోట్ చేస్తున్నా" అని సమంత తెలిపారు.

## ఏదో ఏదో.. కార్తిక్ గానంతో స్వీట్ మెలోడీ

యువ హీరో రాహుల్ విజయ్ ఈమధ్య కాలంలో డిఫరెంట్ కంటెంట్ ఉన్న కథలను సెలెక్ట్ చేసుకుంటున్న హీరోగా మంచి క్రేజ్ అందుకుంటున్నాడు. ఇక అతని సినిమాలలో పాటలు కూడా వైరల్ అవుతుండడం విశేషం. ఇక వేదాంశ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై అర్జున్ దాస్యాన్ నిర్మిస్తున్న తాజా చిత్రం ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్ లో అతను హీరోగా చేస్తున్నాడు. ఈ సినిమా మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. / రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న ఈ సినిమాలో తొలి పాటగా విడుదలైన "ఏదో ఏదో" సాంగ్ ఇప్పుడు సంగీత ప్రియుల హృదయాలను తాకుతోంది. ఈ మెలోడీ ట్రాక్ వినగానే మనసుని తేలికగా తాకేలా ఉంటుంది. ప్రముఖ గాయకుడు కార్తిక్ తన గానంతో పాటను మరింత మధురంగా మార్చారు. ముఖ్యంగా కార్తిక్ వాయిస్‌లో కరుణ కలిగించే ఆవేదన, నేహా వాయిస్‌లో మృదుత్వం కలిసి ఈ పాటను ప్రత్యేకంగా నిలిపాయి. ఈ పాటకు సంగీతాన్ని అందించిన సురేష్ బొబ్బిలి, తన ట్రేడ్మార్క్ స్టైల్‌ను కొనసాగిస్తూ ఈ సారి కొత్తగా కంపోజ్ చేశారు. పూర్ణ చారి అందించిన లిరిక్స్ కూడా పాటకు అర్థవంతమైన భావాలను అందించాయి. ప్రేమలో ఉన్న జంట మధ్య భావోద్వేగాలను ఈ పాట చక్కగా వ్యక్తీకరిస్తుంది. లిరికల్ వీడియోలో రాహుల్ విజయ్, నేహా పాండే మధ్య కెమిస్ట్రీ ఎంతో సహజంగా చూపబడింది. ఇద్దరి మధ్య ఉన్న అనురాగం, ఆత్మీయత ఈ పాట ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యంగా కొన్ని సింపుల్ కాన్సెప్ట్ విజువల్స్‌తో ఈ పాటను ప్రేక్షకులు తిరిగి తిరిగి వినాలనిపించేలా తీర్చిదిద్దారు. ఈ సినిమాకు అశోక్ రెడ్డి కడదోరి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. డెబ్యూట్ మూవీ అయినప్పటికీ, ఆయన విజన్ క్లారిటీగా కనిపిస్తోంది. సినిమాలో గెటప్ శ్రీను, అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గంగవ్వ, రచ్చ రవి, రవి వర్మ వంటి కామెడీ, క్యారెక్టర్ ఆర్టిస్టులు నటించబోతున్నారు. ఇది పూర్తి ఫన్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడం విశేషం. మొత్తంగా చూసుకుంటే, ఈ పాటతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉండగా, త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను ప్రకటించబోతున్నారు.




## పార్ట్ 3 ప్రకటన కోసం ఎదురు చూపులు

కన్నడ సినిమా పరిశ్రమ స్థాయిని పెంచిన సినిమా కేజీఎఫ్ అనడంలో సందేహం లేదు. అంతకు ముందు వరకు కన్నడ సినిమాలు రూ.50 కోట్లు వసూళ్లు చేస్తే బ్లాక్ బస్టర్‌గా చెప్పుకునే వారు, వంద కోట్ల వసూళ్లు అనేది కన్నడ సినిమా ఇండస్ట్రీలో అసాధ్యం అనే అభిప్రాయం ఉండేది. అలాంటి పరిస్థితి నుంచి ఒక్క సారిగా పరిస్థితులు మార్చేసిన ఘనత కేజీఎఫ్ సినిమాకు దక్కుతుంది. తక్కువ సమయంలోనే కేజీఎఫ్ సినిమా కన్నడ సినిమా మార్కెట్‌ను అమాంతం పెంచేసింది. యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన కేజీఎఫ్ సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా కన్నడ సినిమా చరిత్రలో నిలిచి పోయింది. కేజీఎఫ్ మొదటి పార్ట్ సూపర్ హిట్ అయితే, కేజీఎఫ్ రెండో పార్ట్ ఏకంగా వెయ్యి కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించడం ద్వారా ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో కన్నడ సినిమా స్థాయిని నిలబెట్టింది. కన్నడ సినిమా ఇండస్ట్రీలోనే సత్తా ఉంది, వందల కోట్ల బడ్జెట్ సినిమాలు చేయడం, అంతకు మించి వసూళ్లు సాధించడం కన్నడ సినిమాలకు సైతం సాధ్యమే అనే అభిప్రాయం కలిగించే విధంగా కేజీఎఫ్ 2 సినిమా నిలిచింది. కేజీఎఫ్ 2 సినిమా విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సమయంలో కచ్చితంగా కేజీఎఫ్ 3 సినిమా వస్తుందని మేకర్స్ ప్రకటించారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యశ్ హీరోగా మరో సినిమా ఉంటుందని, అది కేజీఎఫ్ 3 అనే ప్రచారం జరిగింది. కేజీఎఫ్ 2 సినిమా విడుదలైన ఏడాది దాటినా యశ్ కొత్త సినిమాను కమిట్ కాకపోవడంతో చాలా మంది ప్రశాంత్ నీల్‌తోనే తదుపరి సినిమా చేయాలనే ఉద్దేశంతో ఆలస్యం చేస్తున్నాడనే వార్తలు వచ్చాయి. యశ్ కొత్త సినిమాను చేస్తున్నాడు. టాక్సిక్ అనే టైటిల్‌తో రూపొందుతున్న ఆ సినిమాకు గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమా గురించి కంటే ఎక్కువగా కేజీఎఫ్ 3 సినిమా గురించే చర్చ జరుగుతోంది. ఇటీవల కేజీఎఫ్ సినిమా విడుదలై మూడు ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆ సమయంలో చాలా మంది కేజీఎఫ్ 3 ఎప్పుడు అంటూ సోషల్ మీడియా ద్వారా మేకర్స్‌ను పెద్ద ఎత్తున ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ట్రెండ్ చేశారు. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో డ్రాగన్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. వచ్చే ఏడాది సమ్మర్ వరకు సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్ సినిమాను రెండు పార్ట్‌లుగా చేస్తే కచ్చితంగా వచ్చే ఏడాది మొత్తం అదే పనిలో ఉంటాడు. ఎన్టీఆర్‌తో సినిమా చేస్తున్న ఈ సమయంలోనే ప్రభాస్ సలార్ 2 సినిమాను సైతం ప్రశాంత్ నీల్ చేసే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాదిలో లేదా 2027లో ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సలార్ 2 సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇన్ని సినిమాలు లైన్ లో ఉన్న కారణంగా కేజీఎఫ్ 3 సినిమా ఎప్పుడు అనేది చెప్పలేం. కానీ కచ్చితంగా వీరిద్దరి కాంబోలో మూడో మూవీ ఉంటుందనే విశ్వాసం మాత్రం కన్నడ సినీ ప్రేమికుల్లో ఉంది. అప్పటి వరకు మూడో పార్ట్ కోసం ఎదురు చూస్తూనే ఉంటామని వారు చెబుతున్నారు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com